


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 89 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ సోమవారం 9 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 89 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD MON 9 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## మన సైన్యం దెబ్బతీసిన ఎయిర్ బేస్ లో పాక్ మరమ్మతులు

- ఆపరేషన్ సిందూర్ లో పాక్తికంగా దెబ్బతిన భోలారీ ఎయిర్ బేస్
- మరమ్మతుల్లో భాగంగా హ్యాంగర్‌ను తొలగిస్తున్న దృశ్యాలు వైరల్
- ఐఏఎఫ్ దాడుల్లో తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్న పాక్

- మిగతా 2లో

- సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర విమర్శలు
- చరిత్రలో రేవంత్ అంత చెత్త సీఎం ఎవరూ లేరన్న కేటీఆర్
- బూతులు మాట్లాడటం తప్ప అభివృద్ధిపై దృష్టి లేదని ఆరోపణ
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపు



## చరిత్రలో బూతులు మాట్లాడే ఏకైక మంత్రిగా

# రేవంత్ రెడ్డి మిగిలిపోతాడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి అంత చెత్త, నీచమైన ముఖ్యమంత్రి చరిత్రలోనే ఎవరూ లేరని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాండూరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, రేవంత్ రెడ్డి పాలనపై ఘాటుగా విమర్శలు గుప్పించారు. "ఏ ముఖ్యమంత్రి అయినా పర్యటనకు వెళ్తే అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడతారు. కానీ, బూతులు మాట్లాడే ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు" అని కేటీఆర్ అన్నారు. గత రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ప్రతిరోజూ వందల కోట్లు ఎలా సంపాదించాలన్న ఆలోచనే రేవంత్ రెడ్డికి ఉందని ఆరోపించారు. తాండూరు నర్సింగ్ కాలేజీని ఎత్తుకుపోయిన దొంగ రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని, లేదంటే రాబోయే మూడేళ్ల వరకు ఆ పార్టీ నేతలు ప్రజలకు అందుబాటులో ఉండరని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలి



- ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్రేనని కేటీఆర్ ఆరోపణ
- 'ఓటుకు నోటు' కేసు సాక్ష్యాలను నాశనం చేసేందుకే ఈ ఘటన అన్నారు
- ప్రమాదంపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్
- వేలాది క్రిమినల్ కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయని ఆందోళన

- మిగతా 2లో



## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

- ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రమాదం.. సోషల్ మీడియా ప్రచారంపై FSL డైరెక్టర్ కీలక వ్యాఖ్యలు
- ఫోన్ ట్యాపింగ్ కేసులోని ఆధారాలను రిట్రీవ్ చేస్తున్నం
- ఓటుకు నోటు కేసు యథావిధిగా నడుస్తోంది. మెటీరియల్స్ అన్ని ఇప్పటికే కోర్టుకు సమర్పించాం.
- ప్రమాద సమయంలో ఆఫీసులో ఎవరెవరున్నారన్న దానిపై ఆరా తీస్తున్నం
- ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్

**హైదరాబాద్ పెన్ పవర్:** నాంపల్లిలోని తెలంగాణ ఫోరెన్సిక్ ల్యాబ్ భవనంలో అగ్ని ప్రమాదంపై ఎస్ఎ స్ఎల్ డైరెక్టర్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాలు అన్నీ సేఫ్ గా ఉన్నాయని, ఇప్పటికే కొన్ని మెటీరియల్స్ కోర్టుకు సమర్పించామని చెప్పారు. దీనిపై సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 'అగ్నిప్రమాదం సమయంలో ఆఫీసులో ఎవరెవరు ఉన్నారు. అనే దానిపై ఆరా తీస్తున్నం. దయచేసి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నమ్మొ ద్దు.

- మిగతా 2లో



## మంచు విష్ణుకు నోటీసులు


- విద్యార్థుల కిడ్నాప్ కేసులో నటుడు మంచు విష్ణుకు పోలీసుల నోటీసులు
- ఈ కేసులో ఏ2గా విష్ణు, ఏ3గా మోహన్ బాబుపై కేసు నమోదు
- విచారణకు హాజరు కావాలని చంద్రగిరి పోలీసులు ఆదేశం
- యూనివర్సిటీ పీఆర్వో సహా పలువురిని ఇప్పటికే అరెస్ట్ చేసిన పోలీసులు
- విష్ణు, మోహన్ బాబులను అరెస్ట్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

- మిగతా 2లో

## 1.25 కోట్ల మంది హిందువులు పోరాడాలని నిర్ణయించుకుంటే...!

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు
- బంగ్లా హిందువుల పోరాటానికి ప్రపంచ హిందువుల మద్దతు ఉంటుందన్న భగవత్
- ముంబైలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వ్యాఖ్యలు
- బంగ్లాలో మైనారిటీలపై పెరిగిన హింసపై ఆందోళన
- భారత్‌ను ఎవరూ బలహీనపరచలేరని స్పష్టీకరణ
- జనాభా మార్పులపై గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శ

- మిగతా 2లో



## పొలాల్లో కూలిపోయిన విమానం... ముందే దూకేసిన కెప్టెన్, ట్రైనీ పైలట్!

- కర్ణాటకలోని విజయపుర జిల్లాలో కూలిన శిక్షణా విమానం
- ఇంజిన్‌లో సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక అంచనా
- ప్రమాదంలో కెప్టెన్, ట్రైనీ పైలట్‌కు గాయాలు
- కలబురగి నుంచి బెలగావి వెళుతుండగా ఘటన

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలో ఆదివారం ఓ ప్రైవేట్ శిక్షణా విమానం కుప్పకూలింది. విజయపుర జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో విమానం పొలాల్లో క్రాష్

- మిగతా 2లో





## హైదరాబాద్లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..

### రెండు రోజుల్లో 604మందిపై కేసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ పై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. జీరో టాలరెన్స్ విధానంలో తాగి బండి నడిపినవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. వీకెండ్స్‌లో నగరవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. గడిచిన రెండు రోజుల్లో హైదరాబాద్‌నగర వ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 604మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవీస్ తెలిపారు. రెండు రోజులుగా నగరవ్యాప్తంగా జరిపిన తనిఖీల్లో 604 మంది వాహనదారులపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో బైకర్స్ ఎక్కువగా ఉన్నారు. 492 మంది బైకిస్టులు, 42 మంది ఆటో డ్రైవర్లు, 70 మంది ఫోర్ వీలర్స్ ఇతర వాహన దారులపై కేసులు నమోదు చేశారు. వీరంతా అధికమొత్తంలో మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు పోలీసులు చెప్పారు. ఈ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారుల్లో రక్తంలో ఆల్కహాల్ మోతాదుకు మించి ఉన్నట్లు తేలింది. అనుమతించిన పరిమితి 30 మైక్రోగ్రాములు మాత్రమే కాగా..


- మిగతా 2లో

## సిద్ధిపేట జిల్లాలో పెద్దపులి కలకలం... వరుసగా పశువులపై దాడులు!

- సిద్దిపేట జిల్లాలో పశువులపై పులి దాడులు
- తాజాగా ఐదు దూడలను చంపివేయడంతో భయాందోళనలు
- పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ ముమ్మర యత్నాలు
- పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దని ప్రజలకు హెచ్చరిక
- ఈ పులి మహారాష్ట్ర నుంచి వచ్చినట్లు అధికారుల అనుమానం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో ఓ పెద్దపులి సృష్టిస్తున్న భయాందోళనలు కొనసాగుతున్నాయి. వరుసగా పశువులపై దాడి చేస్తూ వాటిని చంపుతుం డటంతో స్థానిక గ్రామాల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తమ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు

- మిగతా 2లో



## ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు తెలంగాణ సొమ్ము దోచుకున్నరు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్ట్‌ల పేరుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు తెలంగాణ సొమ్ము దొచుకున్నరని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం (ఫిబ్రవరి 8) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి వివేక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మల్లన్న సాగర్ ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుందని ఆరోపించారు. పదేండ్లలో కాంట్రాక్టర్లకు పైసలు ఇచ్చారు కానీ బీద ప్రజలకు ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డులు, మహిళలకు ఫ్రీ బస్సు, ఉచిత కరెంట్, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్

- మిగతా 2లో

## ఏప్రిల్ తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇందిరమ్మ ఇండ్ల ఆశావహులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. 2026, ఏప్రిల్ తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించారు. తొలి విడతలో భాగంగా నాలుగన్నర లక్షలు ఇండ్లు కట్టించామని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 25 లక్షల

- మిగతా 2లో

## బీజేపీని ఓడించేందుకు రూ.100 కోట్ల డీల్

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్‌లో కాంగ్రెస్, ఎంఐఎం వర్సెస్ బీజేపీ మధ్య ఆట స్టార్ట్ అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇండియా పాకిస్తాన్‌ను చిత్తు చేసినట్లుగా కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలకు బుద్ధి చెప్పండని పిలుపునిచ్చారు. ఆదివారం (ఫిబ్రవరి 8) కరీంనగర్‌లో ఆయన మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, ఎంఐఎం రహస్య సమావేశం పెట్టుకుందని.. బీజేపీ 50 సీట్లలో గెలవబోతోందని తెలిసి



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# క్యాన్సర్‌ను ఓడిద్దాం

మనదేశంలో క్యాన్సర్ పెద్ద సమస్యగా మారింది. ఏటా 15 లక్షలకు పైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. రోజురోజుకీ జనాభా, వృద్ధుల సంఖ్య, పట్టణీకరణ, జీవనశైలి మార్పులు పెరుగుతున్న తరుణంలో ఇవి మరింత భారంగా పరిణమించటం ఖాయంగా కనిపిస్తోంది. క్యాన్సర్ మరణాలూ ఎక్కువయ్యే ప్రమాదముంది. మరి దీన్ని ఓడించే మార్గమే లేదా? క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుంటే ఇది సాధ్యమే. నివారణ మార్గాలతో రాకుండా చూసుకోవచ్చు. హెచ్చరిక సంకేతాలతో ముందే గుర్తించొచ్చు. ఇప్పుడు అత్యాధునిక చికిత్సలూ భరోసా కల్పిస్తున్నాయి. క్యాన్సర్‌ను ఎదుర్కోవటానికి మానసికంగా దృఢంగా ఉండటమూ ముఖ్యమే. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా వీటిన్నింటిపై సమగ్ర కథనం మీకోసం.అధునాతన చికిత్సల పుణ్యమాని ఇప్పుడు ఎంతోమంది క్యాన్సర్ నుంచి బయటపడుతున్న మాట నిజమే అయినా దీన్ని నివారించుకోవటంలోనే ఉంది అసలు విజ్ఞత. క్యాన్సర్లను తగ్గించుకోవటానికి సమర్థమైన, చవకైన, సుస్థిరమైన వ్యూహం ఇదేనన్నా అతిశయోక్తి కాదు. అందువల్ల జబ్బు వచ్చాక చికిత్స తీసుకోవటం కన్నా నివారించుకోవటం మీద దృష్టి సారించేలా చూడటం ప్రధానం. ప్రజలతో పాటు ప్రభుత్వాలు, సంస్థలూ కలిసి కట్టుగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుంది.

**నివారణే ప్రధానం**

ఆశ్చర్యంగా అనిపించినా సుమారు 40-50% క్యాన్సర్లు నివారించుకోదగ్గవే. జీవనశైలిని మార్చుకోవటం, టీకాలు తీసుకోవటం, తొలిదశలో గుర్తించటం, పర్యావరణ పరిరక్షణ ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. మనదేశంలో చాలామందిలో ముదిరిన తర్వాతే క్యాన్సర్ బయటపడుతుండటం, మారుమూల ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అంతగా అందుబాటులో లేకపోవటం వంటి పరిస్థితుల నేపథ్యంలో నివారణ చర్యలతో ఎంతోమంది ప్రాణాలను కాపాడుకోవచ్చు. క్యాన్సర్‌తో బాధపడకుండా చూసుకోవచ్చు. వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చు. కాబట్టి నివారించుకోదగిన ప్రధానమైన క్యాన్సర్ ముప్పు కారకాల గురించి తెలుసుకొని ఉండటం మంచిది.

**పొగాకు వాడకం – ముఖ్యమైన కారణం**

పొగాకు ఏ రూపంలోనైనా హానికరమే. సిగరెట్లు, చుట్టలు, బీడీలు కాల్చినా.. గుట్కా, జర్దా, ఖైనీ నమిలినా క్యాన్సర్ ముప్పు కొని తెచ్చుకున్నట్టే. మనదేశంలో మూడింట ఒకవంతు క్యాన్సర్లకు పొగాకే కారణం. నోరు, గొంతు, నాలుక, ఊపిరితిత్తులు, అన్నవాహిక, మూత్రాశయ క్యాన్సర్లకూ పొగాకు వాడకానికీ బలమైన సంబంధం ఉంది.

పొగ తాగొద్దు, పొగాకు నమలొద్దు. అలవాటుంటే వెంటనే మానెయ్యాలి.

పొగాకు వాడకాన్ని నిషేధించే చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి.

బడులు, సమాజంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

పొగ మానెయ్యటానికి కౌన్సెలింగ్, తోడ్పాటు ఇవ్వాలి.

**ఆరోగ్యకర ఆహారం, వ్యాయామం కీలకం**

క్యాన్సర్ నివారణకు తోడ్పడే జీవనశైలి మార్పుల్లో అతి ముఖ్యమైనవి ఇవే. మాంసం, చక్కెర, ఉప్పు ఎక్కువగా తినటం.. పండ్లు, కూరగాయలు తక్కువగా తినటం వల్ల పెద్ద పేగు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్లు తలెత్తే అవకాశముంది. వ్యాయామం, శారీరక శ్రమ తగ్గినా క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది.

పండ్లు, కూరగాయలు, నిండు గింజ ధాన్యాలు, పప్పులతో కూడిన సమతులాహారం తీసుకోవాలి.

పండ్లు, కూరగాయల్లో క్యాన్సర్ నిరోధకాలు ఎక్కువగా ఉంటాయి. మాంసాహారులు మాంసం తగ్గించుకోవాలి.

బాగా శుద్ధిచేసి తయారుచేసిన ఆహార పదార్థాలు, తీపి పానీయాలు, కొవ్వు పదార్థాలు పరిమితం చేసుకోవాలి.

వీలైనంత వరకూ ఉడికించిన పదార్థాలు తినాలి. వేపుళ్లు తగ్గించుకోవాలి.

రోజూ కనీసం అరగంట వ్యాయామం చేయాలి.

శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి.

**మద్యం – పెద్ద శత్రువు**

**మద్యం క్యాన్సర్ కారకం. ఇది కాలేయం, రొమ్ము, నోరు, గొంతు, అన్నవాహిక క్యాన్సర్లకు దారితీస్తుంది.**

మద్యం జోలికి వెళ్లొద్దు. అలవాటుంటే పరిమితం చేసుకోవాలి.

మద్యంతో ముంచుకొచ్చే ముప్పుల మీద ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

**టీకాలు – ఒక అభయం**

మనదేశంలో కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్లు క్యాన్సర్లు తలెత్తటంలో పెద్ద పాత్ర పోషిస్తున్నాయి. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ)తో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్.. హెపటైటిస్ బి, సితో కాలేయ క్యాన్సర్.. హెలికోబ్యాక్టర్ పైలోరీతో జీర్ణాశయ క్యాన్సర్లు వస్తున్నాయి. అదృష్టం కొద్దీ హెచ్‌పీవీ, హెపటైటిస్ బి నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయి.

యుక్తవయసు అమ్మాయిలందరికీ హెచ్‌పీవీ టీకా ఇప్పించాలి. వీలైతే అబ్బాయిలకూ ఇప్పించటం మంచిది.

సార్వత్రిక హెపటైటిస్ బి టీకా కార్యక్రమాన్ని అమలు చేయాలి.

సూదులు ఇవ్వటం, తీసుకోవటం, రక్త పరీక్షల విషయంలో సురక్షిత విధానాలు పాటించాలి.

దీర్ఘకాల ఇన్‌ఫెక్షన్లకు ముందుగానే చికిత్స తీసుకోవాలి.

**పర్యావరణ, వృత్తిపర అంశాలు**

గాలి కాలుష్యం, పురుగు మందుల ప్రభావం, పారిశ్రామిక రసాయనాలు, పనిచేసే చోట సురక్షితంగా లేకపోవటం వంటివీ క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తాయి. ముఖ్యంగా ఊపిరితిత్తి, చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువ.

కాలుష్యాన్ని కట్టడి చేయటానికి కఠినమైన చర్యలు తీసుకోవాలి.

పరిశ్రమలు, ఆఫీసుల్లో భద్రత నియమాలు పాటించాలి.

అవసరమైన చోట మాస్కుల వంటివి ధరించే ఏర్పాట్లు చేయాలి.

పర్యావరణ ప్రమాదాల మీద ప్రజలకు అవగాహన కల్పించాలి.

**ముందస్తు పరీక్షలు, తొలిదశలో గుర్తించటం**

క్యాన్సర్ నివారణ చర్యలు ముప్పును తగ్గిస్తే.. తొలిదశలో గుర్తించటం ప్రాణాలను కాపాడుతుంది. ఎందుకంటే తొలిదశలోనే పట్టుకొని, తగు చికిత్స చేస్తే ఎన్నో క్యాన్సర్లను
నయం చేయొచ్చు. ఇందుకు ముందస్తు పరీక్షలు (స్క్రీనింగ్) బాగా ఉపయోగపడతాయి.

వీఐఏ (విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ అసిటిక్ యాసిడ్), పాప్ స్మియర్, హెచ్‌పీవీ పరీక్షలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందే గుర్తించటానికి తోడ్పడతాయి.

రొమ్ముల స్వీయపరీక్ష, డాక్టర్‌తో పరీక్షించుకోవటం, మామోగ్రామ్ ద్వారా రొమ్ముక్యాన్సర్‌ను పట్టుకోవచ్చు.

తరచూ నోటిని పరీక్షించుకోవటం ద్వారా ముఖ్యంగా పొగాకు అలవాటు గలవారిలో నోటి క్యాన్సర్ ఆనవాళ్లను గుర్తించొచ్చు.

పెద్దపేగు క్యాన్సర్ ముప్పు ఎక్కువగా గలవారికి కొలనోస్కోపీ పరీక్షతో ముందే కనుక్కోవచ్చు.

**అవగాహన ఆయుధంగా**

అవగాహన లేమి, అపోహలు, చిన్నచూపు, భయం మూలంగా క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యమవుతోంది. అందువల్ల క్యాన్సర్ హెచ్చరిక సంకేతాలను గుర్తించటం, అపోహలను తొలగించటం, సమయానికి డాక్టర్‌ను సంప్రదించటం, చిన్నప్పటి నుంచి ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించటం మీద విస్తృతంగా ప్రచారం చేయటం, అవగాహన కల్పించటం ముఖ్యం. పాఠశాలలు, కార్యాలయాలు, మీడియా, సామాజిక కార్యకర్తలు అంతా ఇందుకు కృషి చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

## మన సైన్యం దెబ్బతీసిన ఎయిర్ బేస్ లో పాక్ మరమ్మతులు

భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ లో తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, తామే భారత విమానాలు కూల్చేశామని పాకిస్థాన్ ప్రగల్భాలు పలుకుతున్న సంగతి తెలిసిందే. వాస్తవాలను కప్పిపెట్టి ఆ దేశం చేస్తున్న ప్రకటనల్లోని డొల్లతనం మరోసారి బయటపడింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) యుద్ధవిమానాలు జరిపిన దాడిల్లో పాక్ లోని పలు ఎయిర్ బేస్ లు దెబ్బతిన్నాయి. ఇదే విషయాన్ని భారత్ ప్రపంచానికి వెల్లడించింది. పాక్ డ్రోన్ దాడులకు జవాబుగా మన వాయుసేన మే 10 న భొలారీ బేస్‌ను టార్గెట్ చేసి దాడులు జరిపింది.

ఈ దాడిలో ఉపయోగించిన ఆయుధాల వివరాలను వెల్లడించనప్పటికీ.. ఎయిర్ బేస్ ను పాక్షికంగా దెబ్బతీశామని ప్రకటించింది. పాక్ మాత్రం ఈ వాదనను కొట్టిపారేసింది. అయితే, తాజాగా వెలుగుచూసిన ఉపగ్రహ చిత్రాల్లో భొలారి లోని పాక్ వాయుసేన స్థావరం దెబ్బతిన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు.. అందులోని దెబ్బతిన్న ఓ హ్యాంగర్ కు మరమ్మతులు చేయడం తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 28న వాంటోర్ సంస్థకు చెందిన ఉపగ్రహాలు ఇక్కడ చిత్రాలను తీశాయి. ఆ సమయంలో ఎయిర్ బేస్‌లో దెబ్బతిన్న హ్యాంగర్‌కు పాక్ దళాలు మరమ్మతులు చేస్తున్నట్లు తేలింది.

# ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో (ఎఫ్ఎస్ఎల్) శనివారం జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్ర పన్నారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత ఘటనే అని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదివారం నాడు హనుమకొండలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఓటుకు నోటు' కేసు తుది తీర్పు దశకు చేరుకున్న సమయంలో, సాక్ష్యాలను శాశ్వతంగా నాశనం చేయాలనే దురుద్దేశంతోనే ఈ ప్రమాదాన్ని సృష్టించారని అన్నారు. అత్యంత భద్రత ఉండే ల్యాబ్‌లో, అదీ శీతాకాలంలో మంటలు చెలరేగడం, 24 గంటలూ సిబ్బంది ఉండాల్సిన చోట ఎవరూ లేకపోవడం వంటివి అనేక అనుమానాలకు తావిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు."ప్రారంభంలో స్వల్ప నష్టమే జరిగిందని అధికారులు చెప్పారు. కానీ ఆ తర్వాత 2015 నుంచి పదేళ్ల విలువైన సాక్ష్యాధారాలు పూర్తిగా కాలిపోయాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం కుట్ర అనే అనుమానాన్ని బలపరుస్తోంది" అని కేటీఆర్ వివరించారు. కేవలం ఒక అంతస్తుకు పరిమితమైన మంటలను ఆర్పేందుకు మూడున్నర గంటలకు పైగా సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనలో దాదాపు 50 కంప్యూటర్లు, సర్వర్లు, డిజిటల్ రికార్డులు కాలిపోయాయని ఆరోపించారు.ఈ ప్రమాదంలో వేలాది తీవ్రమైన క్రిమినల్ కేసులకు సంబంధించిన ఆధారాలు కూడా ధ్వంసమయ్యాయని,

ఇది ప్రజా భద్రతకు పెను ముప్పు అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దల అండతోనే ముఖ్యమంత్రి ఇదంతా చేస్తున్నారని ఆరోపిస్తూ, దీనిపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని, వారు సీఎంకు ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారని విమర్శించారు. ఘటనపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని, అఖిలపక్ష బృందాన్ని ఎఫ్ఎస్ఎల్ ప్రాంగణాన్ని సందర్శించేందుకు అనుమతించాలని కోరారు.

# బీజేపీని ఓడించేందుకు రూ.100 కోట్ల డీల్

- మొదటి పేజి తరువాయి

రూ.100 కోట్లతో ఓట్లను కొనేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర చేస్తున్నయన్నారు. బీజేపీకి ఇల్లు, కుటుంబం ముఖ్యం కాదని.. దేశం, ధర్మమే ముఖ్యమని పేర్కొన్నారు.కరీంనగర్ ప్రజలారా.. కాంగ్రెస్, ఎంఐఎంలకు ఒక్క సీటు కూడా రానీయకుండా చిత్తు చేయండని కోరారు. బీజేపీని గెలిపిస్తే కరీంనగర్‌కు రక్షణ కవచంగా మారుతానన్నారు. బీజేపీ ఓడిపోతే కరీంనగర్ సర్వనాశనమయ్యే ప్రమాదముందని అన్నారు. ఒక్కొక్కరు ఒక్కో బస్తీని దత్తత తీసుకుని గంప గుత్త ఓట్లను బీజేపీకి వేయించండని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించి.. కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధికి చేసేందుకు సహకరించడని విజ్ఞప్తి చేశారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి

ఉదయం 10 గంటలకు ప్రమాదం జరిగింది. ఎఫ్ఎస్ఎల్ ఉద్యోగి సాయికృష్ణసీఐ శ్రీనివాస్ రెడ్డికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి 10.30 నిమిషాలకు అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. మధ్యాహ్నం 1.30 నిమిషాలకు మంటలు అదుపులోకి వచ్చాయి..2013లో ఏసీబీకి సంబందించిన కేసు 16 మెటీరియల్స్ ధ్వంసమయ్యాయి. దీనికి సం బంధించిన మెటీరియల్స్ 2021లోనే ఏసీబీ కోర్టులో డిపాజిట్ చేశాం. ఓటుకు నోటు కేసులో రిపోర్టులను అట్రెడ్ ఏసీబీకి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఇచ్చింది. ఇక్కడ ఆధారాలు కాలిపోయినా ఏసీబీ దగ్గర ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించిన ఆధా రాలతో ఎలాంటి నష్టం లేదు. ఓటుకు నోటు కేసులో యధావిధిగా నడుస్తుంది. 2024లో పంజాగుట్ట పోలీసు స్టేషన్ కు సంబంధించిన ఫోన్ ట్యాపింగ్ కేసు 136 మెటీరియల్స్ ఎస్ఏసిల్ కి వచ్చాయి. ప్రమాదంలో 7 మెటీరియల్స్ కాలిపోయాయి. వీటిని రిట్రీవ్ చేస్తం. అగ్ని ప్రమా దంపై విచారణ జరుగుతోంది' అని తెలిపారు.

**ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదం వెనుక కేటీఆర్ కుట్ర**

**హైదరాబాద్:** నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిసమాదం వెనుక ఆధారాలను కప్పిపుచ్చే ప్రయత్నం ఏమైనా ఉంది అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. దీని వెనుక కేటీఆర్ హస్తంఉంది ఏమోనని నాకు అనుమానం కలుగుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఫోరె నిసింక్ ల్యాబ్లో ఫోన్ ట్యాపింగ్ టేపులు, ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన వివరాలు ఉన్నాయని అందుకే కేటీఆర్ ముందే వచ్చి రేవంత్ రెడ్డిపై అభాండాలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీ చరిత్ర గతంలో తెలంగాణ ప్రజలు చూశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపో గానే ఎస్బ్యుఆఫీస్లో సీసీ కెమెరాలు బంద్ చేసి ఇజ్రాయిల్ నుంచి తెచ్చిన పరికరాలు, ఫైల్స్ మొత్తం ధ్వంసం చేసి మూసీ నదిలో పారేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో కేటీఆర్ కుటుంబం విచారణ ఎదుర్కొంటుంది. అందువల్ల ఫోరెన్సిక్ ల్యాబ్ వెనుక కుట్ర ఉంటే అది కేటీఆర్ వైపు నుంచే ఉంటుంది.

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్ వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ కు అర్థమైంది. అందుకే రేవంత్ రెడ్డిపై విష ప్రచారం చేస్తే ఓట్లు వస్తాయని చిల్లర ప్రచారం చేస్తున్నారు. బావ బావమరిది ఇద్దరూ కలిసి పొద్దున ఒకరు, మధ్యాహ్నం మరొకరు, సాయంత్రం ఒకరు ప్రెస్ మీట్, ట్విట్టర్, చిట్ చాట్ పేరుతో ప్రజలను చీట్ చేస్తున్నరు 'అని అన్నారు.

**ఫోరెన్సిక్ ల్యాబ్ దుర్ఘటనపై సమగ్ర విచారణ చేయించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం:** పోరెన్సిక్ ల్యాబ్ లో జరిగిన దుర్ఘటనపై సమగ్ర విచారణ చేయించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలకు సంబంధించిన ఫైల్స్ కాలిపోవడం కుటేనని ఆరోపించారు. కొత్తగూడెం మున్ని పల్ కార్పొరేషన్లో ఆయన తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్ కేసును బీఆర్ఎస్ ప్రభుత్వం పరేండ్లు నిర్లక్ష్యం చేసింద న్నారు. రెండు పార్టీలని ఒకే విధానాలని విమర్శించారు.

రాష్ట్రాన్ని టీఆర్ఎస్ అప్పుల ఊబిలోకి నెట్టిందని, కాంగ్రెస్ 6 గ్యారెంటీలలో ఒక్కటి మినహా హామీలు విఫలం అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రెండు ప్రభుత్వాలు దారి మళ్లించాయని ఆరోపించారు. రాష్ట్రానికి సీఎం రేవంత్తువ్వు, మాజీ సీఎం కేసీఆర్ కేతువు అని పేర్కొన్నారు. రాష్ట్ర కేబినెట్ లో డీసీల లెక్క తేల్చాలని డిమాండ్ చేసిన బీజేపీ చీఫ్- సభలో సభ్యత్వం లేకుండా ముస్లింక్ మంత్రి పదవి ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ లో వర్గపోరుతోనే కుంభకోణాలు బయట పడ్డాయన్నారు.. సింగరేణి కార్మికుల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# ఏప్రిల్ తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

- మొదటి పేజి తరువాయి

ఇండ్లు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ ఇందిరమ్మ ఇండ్లపై కేసీఆర్ తప్పుడు ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు.

ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం (ఫిబ్రవరి 8) జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని పేదలకు ఆశ చూపారు.. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ ఫ్యామిలీకి ఫాంహౌస్‌లు వచ్చాయి కానీ పేదలకు ఇండ్లు రాలేదని విమర్శించారు.

కేసీఆర్ కుటుంబానికి టీవీలు, పేపర్లు, వ్యాపారాలు వచ్చాయి కానీ పోరాడి తెచ్చుకున్న రాష్ట్రంలో పేదలకు ఏమి రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అందరికీ ఇండ్లు ఉండాలనే సదుద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని.. పైసా లంచం లేకుండా నేడు పేదలు ఇండ్లు కట్టుకుంటున్నారన్నారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి బీజేపీ, బీఆర్ఎస్‌కు సిగ్గుండాలని అన్నారు. కేసీఆర్, మోడీని చూసి ఓటేస్తే మోసపోతాం.. గోస పడ్తామని చెప్పారు.

# మంచు విష్ణుకు నోటీసులు

విద్యార్థి నాయకుల అపహరణ కేసులో ప్రముఖ నటుడు, 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కిడ్నాప్ ఆరోపణలకు సంబంధించి విచారణకు హాజరు కావాలని ఆదివారం చంద్రగిరి పోలీసులు ఆదేశించారు. ఈ కేసులో మంచు విష్ణును ఏ2 (రెండో నిందితుడు)గా చేర్చినట్లు పోలీసులు తెలిపారు.మోహన్ బాబు యూనివర్సిటీలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ, ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు షేక్ అలీ అక్బర్, వినోద్ కుమార్‌లను గత వారం కొందరు దుండగులు అడ్డుకున్నారు. వారిపై దాడి చేసి, బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి అపహరించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై తిరుచానూరు, చంద్రగిరి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.ఈ కేసులో యూనివర్సిటీ పీఆర్వో సతీశ్‌ను ఏ1గా, మంచు విష్ణును ఏ2గా, ఆయన తండ్రి మోహన్ బాబును ఏ3గా చేర్చారు. సతీశ్‌తో పాటు మరికొందరు బౌన్సర్లను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. తాజాగా మంచు విష్ణుకు రెండు నోటీసులు అందాయి. విద్యార్థులపై పెట్టిన ఫిర్యాదుకు ఆధారాలు ఇవ్వాలని ఒక నోటీసులో, కిడ్నాప్ కేసు విచారణకు రావాలని మరో నోటీసులో పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ మోహన్ బాబు ఆంధ్రప్రదేశ్

హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన విద్యార్థి సంఘాలు, వామపక్షాలు... విష్ణు, మోహన్ బాబులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేసి, అక్రమంగా వసూలు చేసిన రూ.26 కోట్ల ఫీజులను తిరిగి చెల్లించాలని కోరుతున్నాయి. ఈ కేసులో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## హైదరాబాద్లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..

- మొదటి పేజి తరువాయి

అంతకు నాలుగైదు రెట్లు ఉన్నట్లు గుర్తించారు. డ్రంక్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నామని ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైతే భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ఠ శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

## ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు తెలంగాణ సొమ్ము దోచుకున్నరు

- మొదటి పేజి తరువాయి

బలపర్చిన అభ్యర్థులను భారీ సంఖ్యలో గెలిపించుకున్నామని.. అలాగే మున్సిపాలిటీలను కూడా కైవసం చేసుకుందామని పిలుపునిచ్చారు.

## 1.25 కోట్ల మంది హిందువులు పోరాడాలని నిర్ణయించుకుంటే...!

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ బంగ్లాదేశ్‌లోని హిందువుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు తమ హక్కుల కోసం పోరాడాలని నిర్ణయించుకుంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరూ వారికి అండగా నిలుస్తారని ఆయన భరోసా ఇచ్చారు. ముంబైలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ముంబైలోని వర్లీలో ఉన్న నెహ్రూ సెంటర్‌లో '100 ఇయర్స్ ఆఫ్ సంఘ్ జర్నీ: న్యూ హొరైజన్స్' పేరిట రెండు రోజుల కార్యక్రమం జరిగింది. రెండో రోజైన ఆదివారం భగవత్ ప్రసంగించారు. "బంగ్లాదేశ్‌లో సుమారు 1.25 కోట్ల మంది హిందువులు ఉన్నారు. వారు అక్కడే ఉండి పోరాడాలని నిర్ణయించుకుంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా వారికి సహాయం చేస్తారు" అని ఆయన స్పష్టం చేశారు.

ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దాడులు పెరిగాయని భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది జరిగిన 'జూలై తిరుగుబాటు', మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి తర్వాత ఈ హింస మరింత పెరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎంతోమంది హిందువులు ప్రాణాలు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.ఇదే సందర్భంగా భారత్‌పై కూడా భగవత్ మాట్లాడారు. దేశంలో జనాభా మార్పులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటోందని అన్నారు. "ఇప్పుడు భారత్‌ను ఎవరూ బలహీనపరచలేరు. దేశాన్ని విడగొట్టాలని చూసేవారే విడిపోతారు" అని ఆయన హెచ్చరించారు. సంఘ్ ఎవరికీ వ్యతిరేకం కాదని, అధికారం కోసం పనిచేయదని, మరెవరినో నడిపించే రిమోట్ కంట్రోల్ అంతకన్నా కాదని పునరుద్ఘాటించారు. సంఘ్ నిధులు స్వయంసేవకుల నుంచే వస్తాయని, ఆర్ఎస్ఎస్ చీఫ్ పదవికి కులంతో సంబంధం లేదని భగవత్ స్పష్టం చేశారు.

## పొలాల్లో కూలిపోయిన విమానం... ముందే దూకేసిన కెప్టెన్, ట్రైనీ పైలట్!

- మొదటి పేజి తరువాయి

ల్యాండ్ అయింది. ఈ ప్రమాదంలో కెప్టెన్, ట్రైనీ పైలట్ గాయపడ్డారు.వివరాల్లోకి వెళితే, రెడ్ బర్డ్ ఏవియేషన్‌కు చెందిన తేలికపాటి శిక్షణా విమానం కలబురగి నుంచి బెలగావికి బయలుదేరింది. మార్గమధ్యలో విజయపుర జిల్లా పరిధిలోని మంగళూరు సమీపంలోకి రాగానే ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో పైలట్లు విమానాన్ని పొలాల్లో అత్యవసరంగా దించే ప్రయత్నం చేయగా, అది అదుపుతప్పి కూలిపోయింది. ప్రమాద తీవ్రతకు విమానం ముందు భాగం నుజ్జునుజ్జయింది.ప్రమాద సమయంలో విమానంలో కెప్టెన్, ట్రైనీ పైలట్ ఇద్దరు మాత్రమే ఉన్నారు. సమాచారం అందుకున్న బాబలేశ్వర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో గాయపడిన ఇద్దరినీ అంబులెన్స్‌లో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని కెప్టెన్ కునాల్ మల్హోత్రా, ట్రైనీ పైలట్ గౌతమ్ శంకర్‌గా కొన్ని నివేదికలు చెబుతున్నప్పటికీ, ఈ వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది.ప్రాథమికంగా ఇంజిన్ వైఫల్యమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. కాగా, విమానం కూలిపోవడానికి ముందే కెప్టెన్, ట్రైనీ పైలట్ దూకేసినట్టు తెలుస్తోంది.


## సిద్ధిపేట జిల్లాలో పెద్దపులి కలకలం... వరుసగా పశువులపై దాడులు!

- మొదటి పేజి తరువాయి

.తాజాగా కొహెడ మండలం ఆరెపల్లి గ్రామంలో పులి సంచరించినట్లు కొంతమంది రైతులు చెప్పడంతో గ్రామస్థులు భయంతో వణికిపోతున్నారు. సమీపంలోని చంద్రానాయక్ తండా వద్ద మాలోత్ రమేష్ అనే రైతుకు చెందిన ఐదు దూడలను పులి చంపేసింది. స్థానికుల సమాచారంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను సేకరించారు. పులి సంచరిస్తున్న ప్రదేశాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. రైతులు తమ పశువులను పొలాల్లో కాకుండా ఇళ్ల వద్దే సురక్షితంగా కట్టేసుకోవాలని సూచించారు. అలాగే, పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఈ పులి గతంలో జిల్లాలోని ఘనపూర్, అక్కెనపల్లి, బస్వాపురం గ్రామాల్లోనూ పశువులపై దాడి చేసి చంపేసింది. శనివారం జనగామ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పశువులను చంపిన తర్వాతే ఇది సిద్దిపేట జిల్లాలోకి ప్రవేశించి ఉంటుందని అధికారులు తెలిపారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి ఈ పులి తెలంగాణలోకి వచ్చినట్లు అనుమానిస్తున్నారు.వారం రోజుల వ్యవధిలోనే తెలుగు రాష్ట్రాల్లో ఇది రెండో ఘటన. ఫిబ్రవరి 6న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో సంచరించిన ఓ పులిని అటవీ అధికారులు విజయవంతంగా పట్టుకున్న విషయం తెలిసిందే.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



మధుబాబు చికిలే.. వరల్డ్ హ్యూమన్ రైట్స్ జాతీయ డైరెక్టర్..

# ఫుట్‌పాతుల లేవంటే..! మానవహక్కుల ఉల్లంఘనే..!

## వరల్డ్ హ్యూమన్ రైట్స్ జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే..

- పాదచారులకు కూడా రాజ్యాంగంలో ప్రత్యేకంగా నడిచే హక్కు కల్పించారు..
- ఫుట్‌పాత్‌ల అభివృద్ధి లేకపోవడం అంటేనే చట్టం ఉల్లంఘనగా భావించాలి..?
- ఆర్టికల్ 21 నుంచి సుప్రీంకోర్టు మార్గదర్శకాల వరకు చట్టపరమైన అంశాల ప్రస్తావన..
- ఈ ఫుట్‌పాత్‌ల నిర్మాణం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ వంతెనలు లేక ప్రమాదాలు అనేకం..
- ప్రజల భద్రత హక్కుగా భావించి ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 8:** రాజ్యాంగలో కల్పించిన ఆర్టికల్ 21 జీవించే హక్కులో భాగంగా, పాదచారుల భద్రత హక్కు ఒకటని, దీని పట్ల నిర్లక్ష్యం వహిస్తే, ప్రజల ప్రాణాలను హరిం చేస్తుందని వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ డైరెక్టర్ మాధుబాబు చికిలే ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఆర్టికల్ 21 నుంచి సుప్రీంకోర్టు మార్గదర్శకాల వరకు చట్టపరమైన అంశాలను ఆయన ప్రస్తావించారు.. ఫుట్‌పాత్‌లు లేకపోవడం, ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురి కావడం, ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం మానవ హక్కుల ఉల్లంఘనగా అభివర్ణించారు.. పాదచారుల భద్రత, ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రభుత్వాలు తక్షణ చర్యలపై దృష్టి సారించాలని మధుబాబు చికిలే విజ్ఞప్తి చేశారు..

భారత రాజ్యాంగంలోని మానవహక్కులు ఉల్లంఘన కాకుండా చట్టాల అమలుకు సంబంధిత యంత్రాంగం అప్రమత్తం కావాలి.. ప్రజలను ప్రమాదాల భారి నుండి రక్షించాలంటే..! రోడ్ల నిర్మాణంలోనూ, నిబంధనలు, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి.. జీబ్రా క్రాసింగ్‌లు తప్పనిసరి చూడాలి.. ప్రభుత్వం దృష్టి సారించే ప్రధాన అంశాలు..ఫుట్‌పాత్‌లు లేకుండా ఏ రోడ్డు పనులకు అనుమతి ఇవ్వకూడదు..పాదాచారుల భద్రతపై ఆడిట్ తప్పనిసరి చేయాలి.. మార్పుకు మనమే కారణం కావాలి ఫుట్‌పాత్ అనేది కాంక్రీట్ కాదు.. అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు. నడిచే మనిషి ప్రాణం విలువైనదిగా మారే వరకు మన అభివృద్ధి అసంపూర్ణమే.. ఈ వ్యాసం ఒక విజ్ఞప్తి మాత్రమే కాదు.. ఇది చట్టపరమైన హెచ్చరికగా భావించాలి..ఇప్పుడైనా ప్రభుత్వం వినాలి..ఇప్పుడైనా వ్యవస్థ కదలాలి.. మార్పుకు మనమే కారణం కావాలి..



### ఇవన్నీ ఇంజినీరింగ్ నిబంధనలే..! అయినప్పటికీ ఉల్లంఘన..

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై మున్సిపల్ చట్టాలు లేవా..? తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల ప్రకారం:. ఫుట్‌పాత్ అనేది పబ్లిక్ ప్రాపర్టీ.. దానిపై అక్రమ, ఆక్రమణలు నేరంవాటిని తొలగించడం మున్సిపాలిటీ బాధ్యత కానీ వాస్తవంగా ఫుట్‌పాత్లు మారిపోయాయి.. స్ట్రీట్ వెండర్స్ షాపుల విస్తరణకు, బైక్ పార్కింగ్‌కు, కేబుల్ బాక్స్‌లు వినియోగిస్తుంటే..! పాదచారులు నడిచేది ఎలా..?

### రోడ్ సేఫ్టీ పాలసీ అమలు ప్రశ్నార్థకం..!

ఫుట్‌పాత్‌లు లేకపోవడం వల్ల పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తే, వారి ప్రాణాలు ప్రమాదంలో పడితే, అది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంగా పరిగణించాల్సి ఉంటుందని మధుబాబు చికిలే అన్నారు.. మోటార్ వెహికిల్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ పాలసీ అమలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.. మోటార్ వెహికిల్స్ యాక్ట్ 1988 ప్రకారం రోడ్డు వాడకంలో పాదచారులే అత్యంత సున్నిత వర్గమని, రోడ్ భద్రతా ప్రణాళికల్లో వారికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని గుర్తుచేశారు.. అయితే వాస్తవ పరిస్థితుల్లో, వాహనాలకు ఫ్లైఓవర్లు, సిగ్నల్‌లు లేన్‌లు, ఉన్నప్పటికీ పాదచారుల ప్రాణాలకు భద్రత కనిపించడం లేదని విమర్శించారు.. నేషనల్ రోడ్ సేఫ్టీ పాలసీ 2010 ప్రకారం ప్రతి రోడ్డు రూపకల్పనలో ఫుట్‌పాత్‌లు, జీబ్రా క్రాసింగ్‌లు, పాదచారి సిగ్నళ్లు తప్పనిసరి అయినప్పటికీ అవి అమలులో కనిపించడం లేదని ప్రశ్నించారు..

### సుప్రీంకోర్టు దిశానిర్దేశం..! అయినా ఎందుకు అమలు కావడం లేదు..?

సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది, పాదచారి భద్రతపై "రాష్ట్రాలు తక్షణ చర్యలు తీసుకోవాలి" ఫుట్‌పాత్‌లు లేకపోవడం. "మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుందని సుప్రీంకోర్టు మార్గదర్శకాలను మధుబాబు ప్రస్తావించారు..అయినప్పటికి నేటికీ పరిస్థితి మారలేదు.. ఇది కోర్టు ఆదేశాల పట్ల నిర్లక్ష్యం కాదా..? ఇది ప్రమాదం కాదు వ్యవస్థాగత నిర్లక్ష్యం మాత్రమే.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు సగటున, ప్రతి రోజు సుమారు ఎనిమిది మంది పాదచారులు రోడ్లపై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇవి యాదృచ్ఛిక ప్రమాదాలు కావు.. ఫుట్‌పాత్‌లు ఉంటే ప్రమాదం జరిగేది కాదు..




### పాదచారుల హక్కులపై ఆందోళనకర అంశాలు..

భారతదేశంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉంది.. మాట్లాడే హక్కు ఉంది. జీవించే హక్కు ఉంది.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పాదచారుల పరిస్థితి చూస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు.. నడక అనేది అభివృద్ధి ప్రణాళికల్లో చివరి ప్రాధాన్యతగా మారిందని చెప్పారు.. ఇది కేవలం పాలసీ వైఫల్యం మాత్రమే కాకుండా చట్టాల ఉల్లంఘన, అలాగే రాజ్యాంగ వ్యతిరేకతగా అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ హక్కులను ప్రస్తావిస్తూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు కేవలం శ్వాస తీసుకోవడం మాత్రమే కాకుండా భద్రతతో, గౌరవంతో జీవించడం కూడా భాగమని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసిందని తెలిపారు. సురక్షితంగా నడవడం కూడా ఆర్టికల్ 21లో భాగమేనని ఆయన పేర్కొన్నారు..

### జీబ్రా క్రాసింగ్‌లు, పాదచారి సిగ్నల్స్ తప్పనిసరి..

ప్రతి రోడ్డు రూపకల్పనలో ఫుట్‌పాత్‌లు, జీబ్రా క్రాసింగ్‌లు పాదచారి సిగ్నల్స్ తప్పనిసరి అమలు చేయాలని పిల్లలు, వృద్ధులు, వికలాంగులకు అనుకూలంగా డిజైన్ చేయాలని సూచించారు..అసలు ఈ పాలసీ అమలవుతుందా..? లేక కేవలం ఫైల్లకే పరిమితం అవుతుందా..? అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ కోడ్స్ అండ్ "ఐఆర్‌సి గైడ్‌లైన్స్" ఎవరు పాటిస్తున్నారు..? అసలు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సి) మార్గదర్శకాలు చెబుతున్నది ఏంటి..? ఎనిమిది మీటర్ల కనీస వెడల్పు ఫుట్‌పాత్ తప్పనిసరి..! పాదచారుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌లు విస్తృతంగా ఉండాలి.. ఫుట్‌పాత్‌పై పార్కింగ్‌లు, అక్రమ కట్టడాలు, శాశ్వత అడ్డంకులను పూర్తిగా నిషేధించాలి.. ఇలాంటి వాటి విషయంలో యంత్రాంగం సిఫారసులకు తావివ్వకుండా వ్యవహరించాలి..





01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేసేదాక కిషన్ రావు అనే పిలుస్తం



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకల కేసును సీబీఐకి అప్పగిస్తే కేసీఆర్ ఫ్యామిలీని సీబీఐ ఎందుకు విచారణకు పిలవడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలాగే.. ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఈడీ కేటీఆర్‌ను ఎందుకు విచారించడం లేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కేసీఆర్ కుటుంబాన్ని కంచె వేసి కాపాడుతున్నారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేసే వరకు కిషన్ రెడ్డిని కిషన్ రావు అనే పిలుస్తామని స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం (ఫిబ్రవరి 8) జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాజ్య సమితి అని అభివర్ణించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌తో పలువురిని బ్లాక్ మెయిల్ చేసి

-4 లో

## దోచుకున్న సొమ్ముకోసం కేసీఆర్ కుటుంబంలో గొడవలు



**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి పదేండ్లుపాలించి దోచుకున్న సొమ్ముకోసం కేసీఆర్‌కుటుంబంలో అన్నాచెల్లి బంధాలను మర్చి ఆస్తుకోసం గొడవలు పడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. కేసీఆర్ పాలనలో మున్సిపాలిటీలకు మంచినీళ్లు కూడా ఇవ్వలేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపాలిటీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు మంత్రి సీతక్క. పాలనలో చేసిన అప్పులతో రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం..బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లు వేస్తే మురిగిపోయినట్లే.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు సీతక్క. భువనగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను

-4 లో

# మున్సిపల్ ను అద్భుత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా...కొండపల్లి సరిత గణేష్



- కోట్ల రూపాయలతో ఇల్లందు మున్సిపల్ ను అద్భుతంగా మలుస్తున్న...
- గత పాలకులు పట్టణాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు...
- అడిగిన అన్ని పనులు ఇవ్వకుంటే నిలదీయండి...
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించండి...

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు అభ్యర్థిని కొండపల్లి సరిత ను మన కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలనని ఓటర్లను అభ్యర్థించినరు..

జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్ హస్తం గుర్తుకే మన ఓటు ఈ సందర్భంగా మాట్లాడుతూ మన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అద్భుత పాలనను అందిస్తున్నారని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ 5 లక్షల ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచారని రైతు రుణమాఫీ సన్నబడ్లకు బోనస్, ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డులు, ఉచిత కరెంటు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. 9 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు చేసింది శూన్యమని ఇల్లందు నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో భ్రష్టు పట్టించారని ఇల్లందు మండలం పై సమితి తల్లి ప్రేమను చూపారని గత పాలకులు కేవలం ఆస్తులు సంపాదించుకునేందుకే అధికారంలోకి వచ్చారని. తాను అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే ప్రజల కోరిక మేరకు నియోజకవర్గంలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న మని తెలిపారు. సిసి రోడ్లు డ్రైనేజీలు తోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానని, మన కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి నిరంతర ప్రక్రియగా ముందుకు సాగుతామని ఇల్లందు పట్టణం నిరంతర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఇప్పటికే పట్టణాన్ని రెండు అభివృద్ధి పదంలో నడిపిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవం....

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:** భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్పర్సన్ తోట మల్ల రమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పాఠశాల వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. 60 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ విద్యాసంస్థ ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు హాజరై మాట్లాడారు. దాతల సహకారం తో పాఠశాల మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని, జిల్లాలో ఈ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. గత ఏడాది పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించడం తో పాటు ఎన్ఎంఎంఎస్లో ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాల ఘనతను తెలియజేస్తుందని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గత ఏడాది పదో తరగతిలో 569 మార్కులు సాధించిన వై.హాసినికి ప్రసాద్ రాజు రూ. 10,116 నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానం సాధించిన జ్ఞాన వికాసినికి రూ. 5,016 ప్రోత్సాహక బహుమతి అందించారు.రాష్ట్రస్థాయి వాలీబాల్ నందు ఎంపిక కాబడిన విద్యార్థిని ప్రనితికి అభినందనలు తెలియజేసిన ఎంఈఓ టి.రమ, అలాగే అన్ని తరగతుల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు మెమెంటోలు, రూ. 35 వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎస్ఐ స్వప్న, రామకృష్ణ. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమలా రాజశేఖర్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వరలక్ష్మి, వాసవి క్లబ్ అధ్యక్షులు చారుగుల్ల శ్రీనివాసరావు, భద్రాచలం మహిళా సమితి వైస్ ప్రెసిడెంట్ కిరణ్ సింగ్, ఐటీసీ, పీఎస్పీడీ, సారపాక ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు



# "దయన్నకు చెబితే మంత్రికి చేరినట్టే.. పని జరిగినట్టే"

**వ్యూహకర్త.. విశ్వసనీయతకు నిలువెత్తు సాక్ష్యం!**

**ఈనెల 10న పొంగులేటి 'మహాబలం' తుంబూరు దయాకర్ రెడ్డి జన్మదినం**

**సమస్య ఏదైనా.. దయన్నే పరిష్కార వేదిక...**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ పటంలో ఆయనొక అజేయ శక్తి. ప్రతి పల్లెకూ ఆయన పేరు ఒక భరోసా. వ్యూహం ఆయన ఇంటి పేరు.. నమ్మకం ఆయన నైజం. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి కవచంలా, ఆయన రాజకీయ సామ్రాజ్యానికి అపర చాణక్యుడిలా నిలుస్తున్న తుంబూరు దయాకర్ రెడ్డి జన్మదినం ఈ నెల 10వ తేదీ సందర్భంగా ప్రత్యేక కథనం.

**నమ్మకానికి మారుపేరు.. పొంగులేటి వెన్నంటే...**

బంధుత్వంలో మేనల్లుడే అయినా, బాధ్యతలో పొంగులేటి శ్రీనివాస రెడ్డికి నిలువెత్తు అండగా నిలిచారు దయాకర్ రెడ్డి. 2013లో పొంగులేటి రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుండి కష్టకాలంలో నీడలా, విజయాల్లో తోడుగా ఉంటూ ఒక అచంచలమైన శక్తిగా ఎదిగారు. 2019లో పొంగులేటికి ఎంపీ టికెట్ దక్కకపోయినా, ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆయన ప్రాభవం తగ్గకుండా క్షేత్రస్థాయిలో కేడర్ ను సమన్వయం చేయడంలో దయాకర్ రెడ్డి చూపిన చొరవ అసాధారణం. ఏ పార్టీలో ఉన్నా పొంగులేటి మాటే శిరోధార్యంగా భావించే దయాకర్ రెడ్డి, నేడు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి గా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో అత్యంత కీలక వ్యక్తిగా చక్రం తిప్పుతున్నారు.



**ఆత్మీయ సమరం.. విజయానికి వారధి...**

గత ప్రభుత్వ హయాంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన 'ఆత్మీయ సమ్మేళనాలు' ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ చరిత్రను మలుపు తిప్పాయి. పొంగులేటి పిలుపునిచ్చిన ఈ సమ్మేళనాలను విజయవంతం చేయడంలో దయాకర్ రెడ్డి పాత్ర అమోఘం. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఏ చిన్న పల్లెను అడిగినా అక్కడి రాజకీయ సమీకరణాలు ఆయనకు అరచేతిలో వెన్నపూసలా సుస్పష్టం. ఏ మండలంలో ఎవరికి ఎంత పట్టుంది, ఎవరిని ఎప్పుడు చేరదీయాలి అనే విషయాల్లో ఆయన వేసిన పక్కా ప్లానింగ్ వల్లే ఆ సమ్మేళనాలు ప్రభంజనాన్ని సృష్టించాయి. అధికారుల అడ్డంకులు, రాజకీయ ఒత్తిళ్లను చాకచక్యంగా దాటుకుంటూ ఊరూరా పొంగులేటి వర్గాన్ని ఏకం చేయడంలో దయన్న చూపిన కార్యదక్షత అద్వితీయం.

**సమస్య ఏదైనా.. దయన్నే పరిష్కార వేదిక...**

సామాన్య కార్యకర్త నుంచి ప్రజల వరకు ఎవరికి ఏ కష్టం వచ్చినా గుర్తొచ్చే మొదటి పేరు దయాకర్ రెడ్డి. మంత్రి పొంగులేటి దృష్టికి ఏ విషయాన్ని తీసుకెళ్లాలన్నా ఆయనే ఒక బలమైన వారధి. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఓపికగా విని, దాన్ని మంత్రి దగ్గరకు చేర్చి పరిష్కారం అయ్యే వరకు వెన్నంటే ఉండి భరోసా కల్పించడం ఆయన ప్రత్యేకత. "దయన్నకు చెబితే మంత్రికి చేరినట్టే.. పని జరిగినట్టే" అనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించారు. పాలేరు పట్టాభిషేకంలో కీలక పాత్ర పోషించిన ఆయన, నేడు అధికారానికి, సామాన్యుడికి మధ్య ఒక గట్టి వంతెనలా నిలుస్తున్నారు. అందుకే ఈ నెల 10న దయాకర్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, పొంగులేటి అభిమానులు పండుగలా వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

# తపస్ మెదక్ జిల్లా నూతన కమిటీలో చేగుంట మండల ఉపాధ్యాయులు

**హైదరాబాద్ పెన్ పవర్:** నూతన మెదక్ జిల్లా కార్యవర్గ కమిటీ ఎన్నిక ఏడుపాయలలో ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి చేగుంట మండలం నుండి జిల్లా ఉపాధ్యక్షురాలుగా బాలిశెట్టి రేఖ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట), జిల్లా కార్యవర్గ సభ్యులుగా పట్లూరి యాదగిరి (ఎంపీపీఎస్ బాయ్స్ చేగుంట), జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గా దేశపతి కృష్ణమూర్తి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డిపల్లి), జిల్లా సేవా విభాగం కన్వీనర్ గా శీలం మల్లారెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోనాల), జిల్లా కార్యదర్శిగా సి . వి. సుమతి (ఎంపీపీఎస్ రెడ్డిపల్లి), జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా బి. మంజులత (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మక్కరాజుపేట్), హామరా విద్యాలయ హమారా తీర్ పర్యావరణ కో కన్వీనర్ గా పి. ప్రభాకర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డిపల్లి) ఎన్నికైనట్లు తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం జాల సిద్దు తెలిపారు. ఎన్నికైన సభ్యులు సంఘ అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్ తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, తపస్ చేగుంట శాఖ మరియు పలువురు అభినందనలు తెలియజేశారు.



## కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేసేదాక కిషన్ రావు అనే పిలుస్తం

-3 పేజి తరువాయి

వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. జర్నలిస్టులు, లాయర్లు, జడ్జిలు, రియల్టర్లు, సెలబ్రెటీల ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. చివరకు పెళ్లాం మొగుళ్ల మాటలు కూడా విన్నారని మండిపడ్డారు.

కేసుల నుంచి తప్పించుకోవడానికి బీఆర్ఎస్‌కు బీజేపీ సహకరిస్తుందని.. బీజేపీ, బీఆర్ఎస్ బొమ్మ బొరుసు లాంటి వాళ్లు అని అన్నారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటి అవుతున్నాయని.. కానీ దెబ్బకు దెబ్బ కొడతామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో చూద్దాం.. ప్రధాని మోడీ వస్తారో.. కేసీఆర్ వస్తారో రండి చూసుకుందామని సవాల్ విసిరారు.

## దోచుకున్న సొమ్ముకోసం కేసీఆర్ కుటుంబంలో గొడవలు

-3 పేజి తరువాయి

గెలిపించాలని కోరుతూ మంత్రి సీతక్క కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిలు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండపల్లి సరిత విజయం.... ఇల్లందు అభివృద్ధికి చక్కని అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇల్లందు పట్టణంలో ఎంతో చరిత్ర కలిగిన 23 వ వార్డు అభివృద్ధికి ఈ మున్సిపల్ ఎన్నికలు అవకాశం గా మారనున్నాయి. విద్యావంతురాలు గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్గా పనిచేసిన కొండపల్లి సరిత 23వ వార్డు నుంచి అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆశీర్వాదంతో పోటీ చేస్తున్న నేపథ్యంలో వార్డు ప్రజల్లోనూ అభివృద్ధి ఆశలు చిగురిస్తున్నాయి. స్థానికంగా నెలకొన్న సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన సరిత విజయం 23వ వార్డు అభివృద్ధికి బాటలు వేయనుంది. ఈసారి ఎన్నికల్లో ఇల్లందులోనే ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా 23వ వార్డు ప్రజల తీర్పు చారిత్రాత్మకం కానుంది. యువత మహిళలు మేధావుల్లో సైతం రాజకీయాలకు అతీతంగా వార్డు అభివృద్ధి ధ్యేయం కోసం మేమున్నాం అండగా అంటూ.. కొండపల్లి సరితకు అడుగడుగున నీరాజనం పలుకుతున్నారు.

## బిఆర్ఎస్ బిజెపి పాలనలో దుబ్బాకను అభివృద్ధి శూన్యం మంత్రి వివేక్

**ప్రచారం లో పాల్గొన్న చేగుంట ఏఎంసి, డైరెక్టర్ లు**

**హైదరాబాద్ పెన్ పవర్:** బిజెపి బిఆర్ఎస్ పాలనలో దుబ్బాకకు పట్టిన శని, దుబ్బాక అభివృద్ధి కుంటూపడిందని మెదక్ ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.దుబ్బాక లో మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగల్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ తో కలిసి ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దుబ్బాక నిధులను, గత పాలకులు సిద్దిపేటకు తరలించి దుబ్బాక కు అన్యాయం చేయడం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నిబంధనలు పాటించని టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ రెడ్డి పై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ రామలింగారెడ్డి కాలనీ, చేరువాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు కాకుండా ఇండిపెండెంట్ మద్దతుగా ప్రచారం నిర్వహించిన టిపిసిసి ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ రెడ్డి పై అధిష్టానానికి సూచించడం జరిగిందని తెలిపారు. అధిష్టానం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు సన్నబియ్యం, రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దుబ్బాక మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే దుబ్బాక బస్ డిపోకు 10 బస్సులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని వెల్లడించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు ఆ పార్టీ నాయకులు అవినీతికి పాల్పడడం తప్ప అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కెసిఆర్ ఇంట్లో దోచుకున్న డబ్బుల వాటాల విషయంలో పంచాయతీ నడుస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపాలిటీలోని ఓటర్లు ఆలోచించి బిఆర్ఎస్, బిజెపి పార్టీల అభ్యర్థులకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు.,

## మన వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు సరిత ని గెలిపించుకుందాం...

**మన ఇల్లందు.. మన అభివృద్ధి.. మన హస్తం!**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇల్లందు మున్సిపాలిటీ 23వ వార్డు మరియు 24వ ఏరియా ఓటర్ల మహాశయులకు నమస్కారం!మన వార్డుల సమగ్ర అభివృద్ధికి, నిరంతరం మన మధ్యే ఉంటూ మన సమస్యల కోసం పోరాడే నాయకత్వం మనకు అవసరం. అందుకే, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మన ముందుకు వస్తున్నారు సరిత. సరిత కి ఎందుకు ఓటు వేయాలి? స్థానిక సమస్యల పరిష్కారం: డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాలు, మరియు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాను ప్రాధాన్యతగా తీసుకుంటారు. అందుబాటులో ఉండే నాయకత్వం: పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్య విన్నప్పుడు స్పందించే గుణం ఆమె సొంతం. ప్రభుత్వ పథకాల అమలు: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలను మన వార్డులోని అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చూస్తారు. యువత అండ్ మహిళా సాధికారత: వార్డులోని నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాల పట్ల అవగాహన, మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తారు."మాట ఇచ్చారు.. మార్పు తెస్తారు! మన వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు సరిత ని గెలిపించుకుందాం."ఓటు వేయండి.. మార్పును తీసుకురండి! గుర్తుంచుకోండి: హస్తం గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి, సరిత గారిని భారీ మెజారిటీతో గెలిపించవలసిందిగా ప్రార్థన.

# సిపిఐ అభ్యర్థుల గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్తగూడెం కార్పొరేషన్‘కు జరుగుతున్న పాలకవర్గం ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపుని ఏ శక్తి అడ్డుకోలేదని, డబ్బు రాజకీయాల కు ఈ ఎన్నికలు చెక్ పెట్టనున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని 53, 59, 60, 15, 49 డివిజన్లలో జరిగిన ఇంటింటి ప్రచారం, రోడ్ షోల్లో పాల్గొన్నారు. ప్రధాన సెంటర్లలో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రత్యక్షమయ్యే నాయకులతో ప్రజలకు ఒరిగేదేమీలేదని, వారి మోసపూరిత మాటలు, శుష్కవాగ్దానాలు నమ్మి మోసపోవద్దన్నారు. వందేళ్లుగా ప్రజల మధ్యవుంది సేవలందిస్తున్న సిపిఐని ప్రజలు ఆదరించి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో మరింత అభివృద్ధిని సాధించుకునేందుకు విజ్ఞతతో ఓటు వేయాలన్నారు.

జనరంజక పాలన సిపిఐతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అభ్యర్థులు బండి నర్సింహా, ఇమ్రాన్ మహమ్మద్, బేత అనంతలక్ష్మి, కనుకుంట్ల శాంతి, బోయిన విజయ్ కుమార్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

## ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి బర్త్ డే లో పాల్గొన్న అభిమానులు నాయకులు.

**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కుశీబం అనిల్ కుమార్ రెడ్డి బర్త్ డే లో పాల్గొన్న వలిగొండ మండలం నాయకులు అభిమానులు పాల్గొని ఎమ్మెల్యే ను శాలువాతో సన్మానం చేసి బర్త్డే శుభాకాంక్షలు తెలిపినారు. బర్త్ డే వేడుకలో పాల్గొన్నవారు. పాశం సత్తిరెడ్డి చెరుకు శివయ్య గౌడ్ బత్తిని లింగయ్య కాసుల వెంకన్న కొండూరు సాయి నందనం మాజీ సర్పంచి నాగేల్లి మాధవి సత్యనారాయణ సికె న్యూస్ ప్రెస్ రిపోర్టర్ గొలనుకొండ బాలరాజు వలిగొండ మండలం.









## నేడు భద్రాచలం తాసిల్దార్ కార్యాలయం నందు ప్రజావాణి.

### భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు...

**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రాచలం మండల ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, రేపు అనగా ది.09.02.2026 సోమవారం నాడు ఉదయం గం. 10:30 ని. ల నుండి మధ్యాహ్నం 1.00 గం. ల వరకు తహశీల్దార్ కార్యాలయం, భద్రాచలం నందు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడునని భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమమునకు అన్ని శాఖల మండలా ధికారులు హాజరు అవుతున్నందున ప్రజలు, ఇట్టి కార్యక్రమమునందు మీ యొక్క సమస్యలను సంబంధిత శాఖల అధికారులచే

దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అందుకు ప్రజలందరూ తప్పని సరిగా ఈ ప్రజావాణికి వచ్చి దరఖాస్తులను సమర్పించాలని ఆయన తెలుపుతూ మండల ప్రజలు ఇట్టి అవకాశమును సద్వినియోగ పరచుకొనవలసినదిగా ఆయన కోరారు.



## భక్తుల కోలహాలం నడుమ గోదావరి మాత నదిహారతి...

### ఆలయ ఈవో దామోదర్ రావు...



**హైదరాబాద్ పెన్ పవర్:** భాను సప్తమి పర్వదినం రోజు సూర్య భగవానుడికి ప్రీతిపాత్రమైన దినమును పురస్కరించుకొని భక్తుల కోలహాలం జై జై దానాలతో భద్రాచలం గోదావరి మాత నదిహారతి పురోహితుల మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని దేవస్థానం ఈవో దామోదర్ రావు అన్నారు. ఆదివారం శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి కార్యక్రమములో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున ఆయన సూచనల మేరకు నదీ హారతి కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఉదయం దయనందన కార్యక్రమాలు ముగించుకొని వీలును బట్టి గంగా స్నానం ఆచరించి సూర్య భగవానునికి నమస్కరించి, అనంతరం ఇంట్లో పూజా కార్యక్రమాలు చేసుకుంటారని అన్నారు. ఈ రోజు నదిహారతికి ఒక విశిష్టత ఉందని, భాను సప్తమి పర్వదినం సూర్య భగవానుడికి అతి ప్రీతిపాత్రమైన రోజున శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో సాయంత్రం ఐదు గంటలకు భద్రాచలంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ చిన్నారులతో ప్రత్యేక భజన కార్యక్రమం మరియు భక్తి గీతాలతో భక్తుల జై శ్రీ రామాయన మహా అని శ్రీరామ స్మరణతో గోదావరి నదికి భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు రామ వజ్జల రవికుమార్ ఆధ్వర్యంలో గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదిహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారని అన్నారు. అనంతరం పురోహితులు గోదావరి హారతి విశేషాలను ముందుగా వినిపించి, గణపతి పూజ, జైశ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం భక్తులనే స్రుశింప చేసి పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయన మహా అంటూ108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన అనంతరం ముందుగా సీతారామచంద్రస్వామి వారికి12 సార్లు హారతి ఇచ్చిన అనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతిఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామాను గ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని ఆయన అన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి, భద్రాచలం పి వి ఎస్ ఎన్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం, నైవేద్యం, శనగలు భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని, నదిహారతి కార్యక్రమానికి పూజా సామాగ్రి బట్టల షాప్ అసోసియేషన్ భద్రాచలం వారు అందించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, జిపిఈఓ శ్రీనివాసరావు, పురోహితులు సురేష్ వర్మ, పవన్ కుమార్ వర్మ, అశోక్ కుమార్, కృష్ణమాచార్య, కారంబరీ కృష్ణ శర్మ, రామా చార్యులు, తేజ, సామెతి శేషాచార్యులు, స్వచ్ఛంద సంస్థలు, భద్రాద్రి కా మహారాజు ప్రతినిధులు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మన వార్డు మన అభివృద్ధి అదేనా ధ్యేయం.

**8వ వార్డు అభ్యర్థి ఇట్టబోయిన సబితా గోపాల్.**



**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బోనగిరి మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్అభ్యర్థి ఇట్ట బోయిన సబితా గోపాల్ ఈరోజు 8వ వార్డులో భారీగా మహిళలతో ర్యాలీ నిర్వహిస్తూ.

ఇంటింటికి గడపగడపకు తిరుగుతూ ప్రచారంలో భాగంగా అందరినీ కలుసుకుంటూ మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, వార్డుపై నాకు అన్ని విధాలుగా అవగాహన ఉన్నదని ఎనిమిదో వార్డు అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా నడుచుకుంటాన, వార్డులో ఉన్న అన్ని సమస్యలు తీర్చుతానని,కోరుతూ ప్రచారం మహిళలతో ఓటర్లతో నిర్వహించినారు.

## 12వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను.

నా వార్డు అభివృద్ధి నా లక్ష్యం.

12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి తోటకూరి విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్.



**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా బోనగిరి మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బోనగిరి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తోటకూరి విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్ ప్రచారంలో భాగంగా.

భువనగిరిలో భారీగా ర్యాలీ నిర్వహిస్తూ 12వ వార్డు లో ఉన్న ఓటర్లను కలుసుకుంటూ.

ఇంటింటికి గడపగడపకు తిరుగుతూ, చేయి గుర్తుపై ఓటు వేసి నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 12వ వార్డు అభివృద్ధి నా ధ్యేయం అనే లక్ష్యంతో 12వ వార్డులో ప్రచారం నిర్వహించినారు.

## 26వ వార్డు ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను..

**26వ వార్డు కౌన్సిల్ అభ్యర్థి సింగనబోయిన నరసింహ యాదవ్.**

**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన భువనగిరి మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సింగన బోయిన నరసింహ యాదవ్ ఈరోజు 26వ వార్డులో భారీగా ర్యాలీ 500 మంది ఓటర్లతో మహిలలతో ర్యాలీ నిర్వహిస్తూ.

ఇంటింటికి గడపగడపకు తిరుగుతూ చేయ గుర్తుపై ఓటి వేసి నన్ను ఆశీర్వదించి గెలిపించాలని. కాలనీ సమస్యలు అన్ని నా సమస్యలుగా భావించి మీకు అందుబాటులో ఉంటూ 26వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ప్రచారం లో ముందుకు దూసుకెళ్తున్నారు.

## రామయ్య సన్నిధిలో ఐటిడిఏ పిఓ కుమారునికి అన్నప్రాసన..



**హైదరాబాద్ పెన్ పవర్:** మా జేష్ట పుత్రుడు అదృత్ ఆవన్ అన్నప్రాసన శ్రీ సీతారామచంద్రస్వామి సన్నిధిలో నిర్వహించడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. ఆదివారం నాడు ఐటిడిఏ పీవో రాహుల్ మరియు శ్రీమతి మనిషా రాహుల్ దంపతులు తన కుమారుడి అన్నప్రాసన చేయించడానికి దేవస్థానానికి వచ్చిన పిఓ దంపతులకు దేవస్థానం పర్యవేక్షకుడు అర్చక స్వాములు ఘనంగా స్వాగతం పలికి వరి వట్టం అందజేసి ఆశీర్వచనాలతో ఘనంగా అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నప్రాసన కార్యక్రమం కాగానే పిఓ దంపతుల చేత గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, లక్ష్మీ తాయారామ్మ వారిని, శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిఓ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న భద్రాచలంలో తన కుమారునికి అన్నప్రాసన కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు సతీమణి ప్రవీణ, డాక్టర్ రేపాక సాత్విక, మాధవి అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## తొమ్మిదవ వార్డు అభివృద్ధి నా ప్రధాన ధ్యేయం

**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి మున్సిపాలిటీ తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ బొంతల నర్సింగ్ రావు ప్రచారంలో భాగంగా.

తొమ్మిదో వార్డు ఓటర్లతో ప్రజలతో భారీగా ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటికి గడపగడపకు తిరుగుతూ 9వ వార్డు లో ఉన్న సమస్యలు

అన్నిటిని తీర్చుతానని. 9వ వార్డు అభివృద్దే నా ప్రధాన లక్ష్యమని అందరికి అందుబాటులో ఉంటానని మీడియా ద్వారా కోరుతూ చేయ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రచారం నిర్వహించినారు. జిల్లా నాయకులు డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి భువనగిరి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మరియు వలిగొండ మండల నాయకులు కుంభం విద్యాసాగర్ రెడ్డి కూడా ఈ ప్రచారంలో పాల్గొన్నారు.



# కార్పొరేషన్ సమగ్రాభివృద్ధి సిపిఐతోనే సాధ్యం





అభివృద్ధిని చూసి ఓటేయ్యండి.
ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తాం.
ప్రలోబాలతో సిపిఐని ప్రజల నుండి దూరం చేయలేరు.
కార్పొరేషన్ తొలిపీఠం సిపిఐ దే.
కూనంనేని.

**హైదరాబాద్ పెన్ పవర్:** సిపిఐ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కార్పొరేషన్ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, అవినీతి రహిత పాలన కేవలం కమ్యూనిస్టులతోనే చేకూరుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం 26,50,54 డివిజన్లలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని తో పాటు అభ్యర్థులకు మహిళలు హారతులు పట్టి అడుగడుగునా ఘన స్వాగతం పలికాలు. అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కూనంనేని మాట్లాడుతూ తనను రెండు సార్లు ఎంఎల్ఎ గా ఆశీర్వదించారని, పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులను తెచ్చి ఈ ప్రాంతాభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. కమ్యూనిస్టులతో సమగ్రాభివృద్ధి సాధ్యమని, సిపిఐ అభ్యర్థుల గెలుపు ద్వారా కార్పొరేషన్పై ఎర్రజెండా ఎగురవేద్దామన్నారు. నిత్యం ప్రజలతో ఉండే వారికే ప్రజా సమస్యల పై పట్టు ఉంటుందని, వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తారని, ఓట్లు అడిగేందుకు ఎన్నికల సమయంలో కొందరు వస్తుంటారని, వారు మాయమాటలు చెప్పి ప్రలోబాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల కోసం వచ్చే వారు ఎన్నికలు పూర్తయిన తర్వాత మళ్లీ కనిపించరని, సమస్యల కోసం విన్నవించుకుందామన్నా కనీసం ముఖం కూడా చూపించరన్నారు. పదువులున్నా లేకున్నా ప్రజలతో నిత్యం ఉండేది ఎర్రజెండానే అని, ఆ ఎర్రజెండాను కార్పోరేషన్ పై ఎగురవేయడం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. ఎవరు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజల నుండి ఎర్రజెండాను ఎవ్వరూ దూరం చేయలేరని తెలిపారు. కార్పోరేషన్ కావడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, యువతకు

ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఉద్యోగులకు జీతాలు పెరుగుతాయని, పరిశ్రమలు రావడంతో ఆర్థిక శక్తి మెరుగు పడుతుందని, ఇది ఈ ప్రాంతానికి వరమని చెప్పారు. ఈ ఎన్నికలు అహంకారానికి ఆత్మ గౌరవానికి మధ్య జరగుతున్నాయని, ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా కార్పోరేషన్ పై ఎగిరేది ఎర్రజెండానే అన్నారు. ఈ కార్యక్రమాల్లో అభ్యర్థులు దాసరి శ్రీనివాస్, ఎర్ర లింగేశ్వర్, పల్లపోతు భాగ్యలక్ష్మీ, సిపిఐ నాయకులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీను, గెద్దాడు నగేష్, నేరెళ్ల రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే శంకర్ అన్న ఆధ్వర్యంలో ప్రగతి పథంలో ముందుకు సాగుతున్న షాద్ నగర్

కాంగ్రెస్ అభ్యర్థి నజీయా బేగం సర్వర్ పాషాకు మద్దతుగా 17వ వార్డులో జోరుగా ఎన్నికల ప్రచారం
కేశంపేట మండలం మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా షాద్ నగర్ 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాజియా బేగం సర్వర్ పాషా ను గెలిపించాలని ఓటర్ మహాశయులను అభ్యర్థిస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించిన కేశంపేట మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నుస్రత్, అలియా సుల్తానా మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు. ఈ సందర్భంగా వార్డు వ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని కొనసాగించారు.
వార్డులోని వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజలతో మమేకమై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని, ప్రజల విశ్వాసమే తమకు అసలైన బలమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న
సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా పరిష్కారాలు చూపుతామన పేర్కొన్నారు.

# ప్రతిభకు కేరాఫ్ ఇండియన్ హెడ్స్ పాఠశాల

- ఇటు విద్యలో.... అట్టు క్రీడారంగంలో సత్తా చాటుతున్న ఇండియన్ హెడ్స్ పాఠశాల
- చదరంగం టోర్నమెంట్ నిర్వహణ ప్రతిభ చాటిన విద్యార్థులకు ట్రోఫీలు, బహుమతులు ప్రధానం
- క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకే చెస్ చదరంగం టోర్నమెంట్ నిర్వహించాం
- ఇండియన్ హైడ్స్ పాఠశాల చైర్మన్ భువనేశ్వర్ ద్రాక్షాయణి
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మనోహర్
- విద్యార్థుల్లో క్రీడ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలి.
- చదరంగం మాస్టర్ వాన రాసి జగన్ సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ఇండియన్ హెడ్స్ పాఠశాల మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం (చెస్) టోర్నమెంట్ విద్యార్థుల్లో దాగి ఉన్న మేధస్సును వెలికితీసే వేదికగా నిలిచింది.పాఠశాల చైర్మెన్ భువనేశ్వర్ ,ద్రాక్షాయణి , మేనేజింగ్ డైరెక్టర్ సజ్జల మహేశ్వర్, విశ్వేశ్వర్, జగదీశ్వర్ అధ్యక్షతనతో చదరంగం టోర్నమెంట్ నిర్వహించారు.ప్రిన్సిపాల్ సునీత
అధ్యక్షతన వహించారు.మండల విద్యా అధికారి (ఎంఈఓ) మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అండర్8 నుంచి అండర్16 వయస్సు గల దాదాపు 120 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని ఉత్సాహంగా తలపడ్డారు. ప్రతి మ్యాచ్‌లో తెలివితేటలు, వ్యూహాత్మక ఆలోచన, ఏకాగ్రతతో ఆడుతూ చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు.విద్యార్థుల ఆటతీరును చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. చదరంగం వంటి మేధో క్రీడలు పిల్లల్లో ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యం, ఏకాగ్రతను పెంపొందిస్తాయని చెస్ మాస్టర్ వాన రాసి జగన్ సూచించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ విశ్వేశ్వర్ మాట్లాడుతూ...క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకే చదరంగం టోర్నమెంట్ నిర్వహించాం. విద్యతో పాటు క్రీడల్లోనూ పిల్లలు రాణిస్తేనే వారి భవిష్యత్ బలపడుతుంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి మా లక్ష్యం అని తెలిపారు. ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ...పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీ భావనను పెంపొందిస్తాయని అన్నారు. చదరంగం క్రీడాతో ఆలోచనఆత్మక నిర్ణయాలు, మేధాశక్తి పెంపొందుతుందని, విద్యార్థులకు ఒత్తిడికి గురి కాకుండా చదరంగం మేలు చేస్తుందని గుర్తు చేశారు.పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు ట్రోఫీలు, ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు.విజేతలను అభినందిస్తూ పాఠశాల నిర్వాహకులు మరింత ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.విద్యా రంగంలోనే కాక క్రీడారంగంలోనూ ప్రతిభకు కేరాఫ్ అడ్రస్‌గా ఇండియన్ హెడ్స్ పాఠశాల నిలుస్తోందని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణి

**హైదరాబాద్ పెన్ పవర్:** పొద్దుటూరు గ్రామానికి చెందిన. మొగిలి. శ్రీనుకి. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు. మంజూరైన. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును.చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ ఆధ్వర్యంలో. చెక్కుని వారికి అందజేయడం జరిగింది ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును. మంజూరు చేయించిన. బట్టి విక్రమార్క కి. మొగిలి శ్రీను వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేసినారు.

ఈ కార్యక్రమంలో
మాజీ ఉపసర్పంచ్. వేల్పుల కోటయ్య చాపల సొసైటీ అధ్యక్షుడు.
మొగిలి ముత్తయ్య. మాజీ వార్డ్ మెంబర్ చల్ల వెంకట్ రాములు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. మూత్రపు వెంకటేశ్వర్లు అజ్మీర్ నాగేశ్వరావు మొగిలి నరేష్. రేళ్ళ తిరపయ్య. తదితర గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంత రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూర్ గ్రామంలోనీ బీసీ కాలనీలో ఈరోజు బొడ్డు నరేష్ గౌడ్ అనారోగ్యంతో మరణించారు.వారి కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలియజేస్తూ 5000 రూపాయలు ఆర్థిక సహాయంనీ డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంత రెడ్డి వారి కుటుంబసభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు,గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహా,బండారి చిన్న నర్సింహా రెడ్డి,దామెర అంజయ్య,సురకంటి నాగార్జునరెడ్డి,చందర్,నల్ల నవీన్,లక్ష్మణ్,రవి, మచ్చగిరి,మణి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి.

జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్.




**హైదరాబాద్ పెన్ పవర్:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపాలిటీలు మరియు మున్సిపల్ కార్పొరేషన్‌లకు నిర్వహించిన 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా, ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు మరియు సహాయక సిబ్బందికి ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా చేపట్టిన ఓటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల పరిధిలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారమ్‌శ×ఎ స్వీకరణ, పోస్టల్ బ్యాలెట్ పేపర్ల జారీ, ఓటింగ్ నిర్వహణ తదితర అన్ని దశలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా అమలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 23 పోస్టల్ బ్యాలెట్ పేపర్లు ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా జారీ చేయగా, వాటిలో 22 బ్యాలెట్లు సేవా ఓటర్లకు అందజేయడం జరిగింది. ఈ ప్రక్రియలో మొత్తం 23 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోగా, ఇందులో 13 మంది పురుషులు, 10 మంది మహిళలు ఉన్నారు.అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 27 పోస్టల్ బ్యాలెట్ పేపర్లు జారీ చేయబడగా, అందులో 27 మంది సేవా ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించారు. ఇందులో 12 మంది పురుషులు, 15 మంది మహిళలు పాల్గొన్నారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 110 పోస్టల్ బ్యాలెట్ పేపర్లు జారీ చేయబడగా, అందులో 110 మంది సేవా ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించారు. వీరిలో 63 మంది పురుషులు, 47 మంది మహిళలు ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.

## తిర్లాపురం గ్రామంలో రోమన్ కేథలిక్ చర్చిలో సామాన్య ఐదో ఆదివారం స్వస్థత ప్రార్థన



**హైదరాబాద్ పెన్ పవర్:** చింతకాని మండలం తిర్లాపురం గ్రామంలోని ఆదివారం.రోమన్ క్యాథలిక్ చర్చిలో స్వస్థత ప్రార్థన ఘనంగా నిర్వహించారు ఈ ప్రార్థనలో సంఘస్థలందరూ కలిసి పాటలు ద్వారా దేవుని మహిమ పరిశి యేసు బోధనలో మీ భోజనమును ఆకలిగొనిన వారికి వడ్డింపుడుఇల్లువాకిలి లేనివారికి ఆశ్రయమిండు బట్టలులేనివారికి దుస్తులిండుమీ బంధువులకు సహాయము నిరాకరింపకుడువ్యాధిగ్రస్తులను స్వస్థపరపుడు మరణించిన వారిని జీవముతో లేపుడు కుష్ఠరోగులను శుద్ధులను చేసి దయ్యములను ఎల్లగొట్టుడు దేవుడని, ప్రతి ఒక్కరూ మానవసేవే మాధవసేవ అని భావించి ఉన్నంతలో తోటివారికి సేవ చెయ్యాలని సంఘస్తులుకు వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు పంతులు జయరాజు యువతీ, యువకులు,సంఘస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు


## నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొన్న చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్

ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లిలింగం రాంబాబు.



**హైదరాబాద్ పెన్ పవర్:** అదివారం నాడు ఖమ్మం లో జరిగిన దిశ రిపోర్టర్ వెన్నబోయిన సురేందర్ మేన కోడలు, అల్లుడు లింగం వేణు-స్వప్న దంపతుల పిల్లల నూతన వస్త్రాలంకరణ వేడుకల లో పాల్గొన్న చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబుచింతకాని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లింగం రాంబాబు,ప్రెస్ క్లబ్ కార్యదర్శి చిట్టూరి నరేష్,నారపోగు రామకృష్ణ మాతంగి నాగఓరాజు అలవాలా వెంకటనర్సయ్య, కిలారు బాబురావు మీకనబోయిన రాంబాబు షేక్ జానిమియా ఆడెపు శ్యామ్ లు కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# జూన్ 2న కవిత కొత్త పార్టీ.. ఎట్టకేలకు నిర్ణయం?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో మరో పెను సంచలనం నమోదు కాబోతోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనయ, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంత కుంపటి పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణ రాజకీయాల్లో మరో పెను సంచలనం నమోదు కాబోతోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనయ, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంత కుంపటి పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆమె తన నూతన రాజకీయ పార్టీని ప్రకటించనున్నారనే వార్త ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న కవిత, ఇప్పుడు పూర్తిస్థాయిలో ప్రజాక్షేత్రంలోకి రావాలని నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం నినాదాలతో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు.తెలంగాణ సెంటిమెంట్‌కు ప్రతీకగా నిలిచే జూన్ 2న పార్టీ పేరు, జెండా, విధివిధానాలను అధికారికంగా వెల్లడించనున్నారు. ఇప్పటికే తెలంగాణ జాగృతి బృందం కేంద్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదించి, పార్టీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియను పూర్తి చేసినట్లు సమాచారం. ఈ పార్టీ ప్రధానంగా మహిళా సాధికారత, యువతకు ఉపాధి, తెలంగాణ సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలపై దృష్టి సారించనుంది. రాజకీయ నిబంధనలు, ఎన్నికల వ్యూహాలపై ఇప్పటికే పలువురు మేధావులు, న్యాయ నిపుణులతో కవిత వరుస భేటీలు నిర్వహిస్తున్నారు.

**రాజకీయ సమీకరణాలు మారుతాయా?**

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ వేటు పడిన తర్వాత కవిత భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వినిపించాయి. అయితే ఆమె జాతీయ పార్టీల వైపు వెళ్లకుండా సొంత ప్రాంతీయ పార్టీని స్థాపించడమే మేలని భావించినట్లు తెలుస్తోంది. "రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా కవిత అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ భావోద్వేగాలను మళ్ళీ రగిలించడం ద్వారా ప్రజలకు దగ్గరవ్వాలని ఆమె ఆలోచన అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**భారీ బహిరంగ సభకు ప్లాన్?**

జూన్ 2న జరగబోయే ఈ ఆవిర్భావ వేడుకకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తన అనుచరులను, జాగృతి కార్యకర్తలను భారీస్థాయిలో సమీకరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రకటనతో అటు బీఆర్ఎస్, ఇటు అధికార కాంగ్రెస్‌లో ఎలాంటి ప్రకంపనలు మొదలవుతాయో వేచి చూడాలి.

# వాతావరణ శాఖ మరో కీలక అప్ డేట్




వాతావరణ శాఖ మరో కీలక అప్ డేట్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత తగ్గుతోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికీ మిగిలిన అన్ని ప్రాంతాల్లో మాత్రం గరిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పొడి వాతావరణం నెలకొని ఉన్నప్పటికీ, ఉదయం పూట కొన్ని ప్రాంతాల్లో పొగమంచు వాహనదారులను ఇబ్బందులు పెడుతుంది. అయితే తెలంగాణ, ఏపీ లో ఇప్పటికే వేడిగాలుల ఉధృతి ప్రారంభమవ్వడమే కాకుండా ఉక్కపోత కూడా మొదలయింది.

**కొన్ని ప్రాంతాల్లో మాత్రం...**

ఆంధ్రప్రదేశ్ లో చలి పూర్తిగా తగ్గింది. మినుములూరు, అరకు, పాడేరు వంటి ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు ఇంకా నమోదవుతున్నాయి. సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ముప్పయి డిగ్రీలు దాటేశాయి. రాయలసీమ జిల్లాల్లో 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే పల్నాడు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ ఎండల తీవ్రత ఎక్కువగానే కనపడుతుంది. రానున్న రోజుల్లో మరింత వాతావరణం వేడెక్కుతుందని అంటున్నారు.

**పెరిగిన ఉష్ణోగ్రతలు...**

తెలంగాణాలోనూ అక్కడకక్కడ చలిగాలులు ఇంకా వీస్తున్నాయి. ఏజెన్సీ ఏరియాలో కొంత చలి వాతావరణం నెలకొని ఉందని, మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెల్లవారు జామున మాత్రం కొంత చలి కనపడుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్ వంటి ప్రాంతాల్లో కొంత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు. ఉక్కపోత వాతావరణం మొదలు కావడంతో విద్యుత్తు వినియోగం కూడా గణనీయంగా పెరిగింది. ఫ్యాన్లు గిరా గిరా తిరుగుతున్నాయి. 24 గంటలు ఫ్యాన్ వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొనిఉంది.

# యాచారం సాగర్ రోడ్డుపై ఘోర ప్రమాదం.. బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. వ్యక్తి మృతి..




**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని సాగర్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. బైకును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ( ఫిబ్రవరి 8 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. యాచారంలోని సాగర్ రోడ్డుపై ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మంచాల మండలం వెంకటేశ్వర తండా గ్రామానికి చెందిన జాతవత్ హరియాగా గుర్తించారు పోలీసులు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ హరియాను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు యాచారం పోలీసులు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైటాయించారు బంధువులు.హరియా మరణంతో అతని కుటుంబం తీవ్ర విషాదం నెలకొంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రేవంత్ మాటల మంట.. డోస్ ఎక్కువైందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాల్లో మాటల యుద్ధం కొత్త కాదు. అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటివి. అయితే, ఈ విమర్శలు ఏ స్థాయికి చేరుతున్నాయి? ఏ సరిహద్దులను దాటుతున్నాయి? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలు రాజకీయ విజ్ఞతను, సామాజిక బాధ్యతను ప్రశ్నించేలా ఉన్నాయనే ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతోంది.

**విమర్శ వేరు.. వికృత వ్యాఖ్యలు వేరు**

ప్రజాస్వామ్యంలో విధానాల మీద, పాలన మీద, అవినీతి మీద పోరాటం చేయడం ఏ నాయకుడికైనా ప్రాథమిక హక్కు. ప్రజావ్యతిరేక నిర్ణయాలను గట్టిగా నిలదీయడం ప్రతిపక్షాల బాధ్యత అయితే వాటిని సమర్థించుకోవడం లేదా ప్రతిదాడి చేయడం అధికార పక్షం వంతు. కానీ, ఈ క్రమంలో వ్యక్తిగత దూషణలకు దిగడం, కుటుంబ సభ్యులను వివాదాల్లోకి లాగడం ఏ రకమైన రాజకీయమో అర్థం కాని పరిస్థితి.

ముఖ్యంగా శారీరక వైకల్యంతో పోరాడుతున్న వ్యక్తులను రాజకీయ ఉపమానాలుగా వాడటం అత్యంత దురదృష్టకరం. వీణా-వాణీల ఉదాహరణే దీనికి నిదర్శనం. రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేని జీవితంతో అలుపెరగని పోరాటం చేస్తున్న యువతులను రాజకీయ వ్యంగ్యాస్త్రాలుగా వాడటం కేవలం మానవీయతకు విరుద్ధం మాత్రమే కాదు, అది ఒక రకమైన అమానవీయ ప్రవృత్తి.

**బాధ్యతాయుత హోదా.. భాషా శుద్ధి**

ముఖ్యమంత్రి అంటే ఒక వ్యక్తి కాదు.. ఒక వ్యవస్థ. ఆయన పలికే ప్రతి మాట సమాజంపై, ముఖ్యంగా భావి తరాలైన యువతపై బలమైన ముద్ర వేస్తుంది. విమర్శలు రాజకీయ సిద్ధాంతాల మీద ఉండాలి. పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందాలను ఎండగట్టడానికి గత చరిత్రను వాడాలి. ప్రజల ముందు ఉన్న గణాంకాలతో ప్రత్యర్థులను కట్టడి చేయాలి. అంతే తప్ప శారీరక లోపాలను ఎత్తిచూపుతూ విమర్శలు చేయడం వల్ల రాజకీయాల్లో స్థాయి దిగజారడమే తప్ప, గెలుపు లభించదు. దిగజారిన భాష రాజకీయ వాతావరణాన్ని విషపూరితం చేస్తుంది.

**ఆత్మపరిశీలన అవసరం**

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. అధికారం శాశ్వతం కాదు. కానీ మనం వదిలివెళ్లే సంప్రదాయం, మనం మాట్లాడే భాష శాశ్వతంగా ఉండిపోతాయి. ప్రజాస్వామ్యం బలపడాలంటే విమర్శల్లో పదును ఉండాలి కానీ, అవి ఎవరి మనసునో, ఎవరి శారీరక స్థితిని గాయపరిచేలా ఉండకూడదు. "రాజకీయ పోరాటం ప్రజల సంక్షేమం కోసం ఉండాలి, వ్యక్తుల అవమానాల కోసం కాదు."ఎన్నికల వ్యూహాల్లో భాగంగా పదునైన మాటలు అవసరమే కావచ్చు, కానీ అవి 'లక్ష్మణ రేఖ'ను దాటినప్పుడు ప్రజల్లో సదరు నాయకుడి పట్ల ఉన్న గౌరవం తగ్గిపోతుంది. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యంగా బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు తమ భాషా ప్రయోగంపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. మానవత్వం లేని రాజకీయం, విలువల లేని విజయం ప్రజాస్వామ్యానికి శాపం.

# ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో అగ్ని ప్రమాదం.. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నాంపల్లి లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో జరిగిన అగ్నిప్రమాదంపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఫోరెన్సిక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సెంట్రల్ జోన్ పరిధిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు ఎవిడెన్స్‌కు సంబంధించిన కార్యాలయాల్లో అగ్నిప్ర మాదం చోటుచేసుకుంది. వివిధ నేర పరిశోధన కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు, ఫైళ ్లు, డిజిటల్ డేటా నిల్వ ఉంచిన విభాగాలే మంటల్లో దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారు. స్టోర్ చేసి ఉంచిన మెటీరియల్ మొత్తం కాలిపోయి బూడి దైనట్టు సమాచారం అందుతుంది. ఏ ఏ ఫైళ్లు సమాచారం ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయన్నది ఇంకా క్లారిటీ రాలేదు.

**సమగ్ర విచారణకు...**

అయితే దీనికి సంబంధించిన అధికారిక వివరాలు మరికాసేపట్లో తెలియజేయనున్నారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. అయితే, అసలు ఏఏ వస్తువులు తగులబడ్డాయి, ఎంతమేర నష్టం జరిగింది అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని మొదటి అంతస్తులో కంప్యూటర్లు, డిజిటల్ ఎవిడెన్స్‌కు సంబంధించిన వ్యవస్థలు ఉన్నాయని సెంట్రల్ జోన్ డీసీపీ తెలిపారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైళ్లు, ఎవిడెన్స్ ల్యాబొరేటరీ ఆపరేషన్లు ఈ కార్యాలయం నుంచే నిర్వహించేవారని చెప్పారు.

**కీలక కేసులపై...**

దీంతో ఈ అగ్నిప్రమాదం అనేక కీలక కేసులపై ప్రభావం చూపే అవకాశముందని అన్నారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. ఐదు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చామని తెలపిరు. తీవ్ర ప్రయత్నాల తర్వాత మంటలు నియంత్రణలోకి వచ్చాయని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో ల్యాబ్‌లో నలుగురు ఉద్యోగులు ఉన్నారని, మంటలు గమనించిన వెంటనే వారు సురక్షితంగా బయటకు వచ్చినట్లు వెల్లడించారు. ఇదే సమయంలో అక్కడ పని చేస్తున్న ఒక వార్డు బాయ్ మంటలను గమనించి ఆర్పేందుకు ప్రయత్నించగా స్వల్ప గాయాలయ్యాయి. అతడిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ తెలిపారు. ప్రమాదమా? లేక విద్రోహమా? అన్న కోణంలో దర్యాప్తు సాగుతుంది. మరొకవైపు రాజకీయ విమర్శలు కూడా రావడంతో దర్యాప్తును అన్ని కోణాల్లో చేస్తున్నారు.

# వాలంటైన్స్ డే ఎఫెక్ట్... హోటల్ రూమ్ బుక్కింగ్స్ ఏ రేంజ్ లో పెరిగాయంటే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా వాలంటైన్స్ డే రోజు పార్కులు, రెస్టారెంట్లు, సినిమాహాళ్లలోని కార్నర్ సీట్లు హౌస్ ఫుల్ గా ఉండేవని అంటారు. అయితే ప్రస్తుతం వాటి స్థానంలో హోటల్ రూమ్స్ వచ్చాయనే విషయం ఆసక్తిగా మారింది. వాస్తవానికి డిసెంబర్ 31 రాత్రికి కూడా హోటల్ రూమ్ బుక్కింగ్స్ రికార్డులు సృష్టించాయని నివేదికలు వెలువడగా.. తాజాగా అంతకు మించి అన్నట్లుగా వాలంటైన్స్ డే వీకెండ్ లో హోటల్ రూమ్ బుక్కింగ్స్ విపరీతంగా పెరిగాయని అంటున్నారు.అవును... వాలంటైన్స్ డే వీకెండ్ లో బుక్కింగ్స్ లో గణనీయమైన పెరుగుదల ఉందని హోటళ్లు, ట్రావెల్ కంపెనీలు నివేదిస్తున్నాయి. దీంతో.. భారతీయ జంటల ప్రేమికుల దినోత్సవ వేడుకల్లో భారీ మార్పు కనిపిస్తుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. క్లియర్ ట్రిప్ డేటా ప్రకారం...వాలంటైన్స్ డే రోజు హోటల్ బుక్కింగ్స్ గత ఏడాదితో పోలిస్తే సుమారు 175 శాతానికి పైగా పెరిగాయి! ఆ వీకెండ్ ఫిబ్రవరి 13 – 16 మధ్య బుక్కింగ్స్ గత ఏడాదితో పోలిస్తే 58% పెరిగాయని చెబుతున్నారు.

అదారా కంపెనీ డేటా ప్రకారం బుక్కింగ్ ల పెరుగుదలలో ప్రధానంగా దేశంలో ఆగ్రా ముందుంది. ఇక్కడ తాజ్ మహల్ ప్రేమికులను ఎక్కువగా ఆకర్షిస్తుందని అంటున్నారు. ఆ తర్వాత స్థానంలో జైసల్మేర్ ఉండగా... ఇక్కడ జంటలు థార్ ఎడారిలో షాంపైన్ ఈవినింగ్స్ కోసం పరితపిస్తుంటాయని అంటున్నారు. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా మడికేరి, పుదుచ్చేరి, గోవా, ఉదయ్ పూర్, బెంగళూరు, ఊటీ ఉన్నాయి. ఈ ప్రాంతాల వైపే జంటలు ఎక్కువగా మొగ్గు చూపిస్తున్నాయని అంటున్నారు.ఈ సందర్భంగా స్పందించిన అరయ్య హోటల్స్ & రిసార్ట్స్ వ్యవస్థాపకురాలు, సీఈఓ అమృద నాయర్.. ఈ ఏడాది స్పష్టమైన పెరుగుదలను మరింత స్పష్టంగా చూస్తున్నామని.. తమ రిసార్ట్ ల పోర్ట్ ఫోలియోలో బుక్కింగ్స్ 58% నుంచి 110% వరకూ ఉన్నాయని తెలిపారు. ఇదే సమయంలో... ఆగ్రా, జైపూర్, గోవా, గురుగ్రామ్ లలో తమ ప్రాపర్టీలకు డిమాండ్ లో బలమైన పెరుగుదల కనిపిస్తుందని ఐటీసీ హోటల్స్ వెల్లడించింది.అయితే.. ఈ పెరుగుదలను కేవలం శృంగార విహారయాత్రలుగా మాత్రమే చూడనవసరం లేదని.. ఈ బిజీ లైఫ్ స్టైల్ లో జంటలు పరిపూర్ణమైన, ఎలాంటి అంతరాయం లేని ఏకాంతాన్ని కోరుకుంటున్నట్లుగా చూడొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అమెరికాలోనూ ఎఫెక్ట్ ఫుల్ గా కనిపిస్తోంది!:**

ఈ వాలంటైన్స్ డే విహారయాత్రల ఎఫెక్ట్ భారత్ తో పాటు అమెరికాలోనూ తీవ్రంగానే ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో... వాలంటైన్స్ డే వీకెండ్ లో యూఎస్ నుంచి బయలుదేరే రౌండ్ ట్రిప్ విమానాల కోసం 1.6 మిలియన్లకు పైగా ట్రావెల్ ప్లాన్స్ చేసుకున్నారని చెబుతున్నారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 5శాతం పెరుగుదల అని అంటున్నారు. ఇందులో 77% దేశీయ ప్రయాణాలు కాగా 23% అంతర్జాతీయ ప్రయాణాలు. ఈ క్రమంలో ప్రధాన గమ్యస్థానంగా మెక్సికో ఉందని చెబుతున్నారు.


# 'సారీ' మాత్రం చెబితే సరిపోదు జగన్... అర్ణబ్ గోస్వామి సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో అత్యంత తీవ్ర చర్చనీయాంశంగా ఉన్న తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం జాతీయ మీడియాలోనూ హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే ఈ విషయంపై ఏపీలో ప్రభుత్వానికి, ప్రతిపక్షానికీ మధ్య మాటల యుద్ధాలు, తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో తాజాగా ఈ విషయంపై రిపబ్లిక్ టీవీ ఎడిటర్ ఇన్ చీఫ్ అర్ణబ్ గోస్వామి స్పందిస్తూ... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా 'క్షమాపణ' డిమాండ్ చేశారు!అవును... ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో అత్యంత తీవ్ర చర్చనీయాంశంగా మారిన తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై అర్ణబ్ గోస్వామి స్పందిస్తూ... జగన్ పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇందులో భాగంగా... నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని వాదించడంలో అర్థమేంటి జగన్? మీ ప్రభుత్వ హయాంలో టీటీడీకి పంపిన నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందన్నది వాస్తవం కాదా? మీ మతవిశ్వాసాలతో ఎవరైనా ఆడుకుంటే ఊరుకుంటరా? హిందువుల మనోభావాల్ని దెబ్బతీసేందుకు ఎలా అనుమతించారు?అంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై అర్ణబ్ గోస్వామి ప్రశ్నల వర్షం కురిపించారు. ఇదే సమయంలో.. దేశవ్యాప్తంగా తిరుమల లడ్డూ ప్రసాదం పొందడాన్ని గొప్ప ఆశీర్వచనంగా హిందువులంతా పరిగణిస్తారు.. అలాంటి స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పించే లడ్డూను రసాయనాలతో కూడిన సింథటిక్ నెయ్యితో చేశారు.. ఇది దేశంలో 100 కోట్లకు పైగా ఉన్న హిందువుల మనోభావాలను నేరుగా దెబ్బతీసినట్టే. నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదు కాబట్టి ఇది పెద్ద విషయం కాదు అనడం సెంటిమెంట్స్ తో ఆడుకోవడమే అని అర్ణబ్ పేర్కొన్నారు.

ఇదే క్రమంలో... సీబీఐ దర్యాప్తులో కల్తీ నెయ్యి వాడినట్లు రుజువైందని.. హిందువుల విశ్వాసాల్ని దెబ్బతీయడానికి ఇంత భారీ కుట్రకు ఎందుకు పాల్పడ్డారు.. 300 ఏళ్లుగా శుద్ధమైన నెయ్యితో లడ్డూ ప్రసాదాలు చేసే పవిత్ర సంప్రదాయాన్ని ఐదేళ్లలో నాశనం చేశారు.. సిట్ నివేదిక మీకు క్లీన్ చీట్ ఇవ్వలేదు.. ఈ ఘోరతప్పిదానికి 'సారీ' అని మాత్రం చెబితే సరిపోదు.. దేశ ప్రజల ముందు చేతులు జోడించి క్షమించాలని వేడుకోండి.. మరో మార్గం లేదు జగన్ అని అర్ణబ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి!

# కూటమి ప్రభుత్వం మహిళలకు సూపర్ న్యూస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం మహిళలకు గుడ్ న్యూస్ చెప్పింది. కొత్త పథకం అమలుకు గ్రౌండ్ ప్రిపేర్ చేస్తుంది. ఉచితంగా యాభై వేల రూపాయలు ఇచ్చేందుకు సిద్ధమవుతుంది. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినప్పటికీ మహిళలకు పథకాల అమలు విషయంలో ముందుంటారు. డ్వాక్రాసంఘాల ఏర్పాటు చేసిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా గతంలోనే చేశారు. వారికి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఇప్పుడు తాజాగా వారికి స్వయం ఉపాధి పథకం అమలుచేస్తే వారు మరింత ఆర్థికంగా బలోపేతం అవుతారని భావించి చంద్రబాబు విశ్వసిస్తారు. పట్టణాలు, నగరాల్లో మహిళలకు ఆర్థిక చేయూతను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇందుకోసం పట్టణంలో ఉండే పేద మహిళల కోసం నూతనంగా ఎగ్ మార్ట్ లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు పది ఎగ్ మార్ట్ ల చొప్పున రాష్ట్రంలో 260 మార్ట్ లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసింది. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ నేతృత్వంలో ఒక్కొక్క ఎగ్ మార్ట్ కు యాభై వేల రూపాయలు ఉచితంగా ఇవ్వనుంది. ఇందుకోసం ఎంపికయిన మహిళలకు శిక్షణ కూడా ఇవ్వనుంది. ఈ యాభై వేల రూపాయలలో ముప్ఫయి ఐదు వేల రూపాయలతో ఎగ్ కార్ట్ ను ఏర్పాటు చేసుకోవాలి. మరో పదిహేను వేల విలువైన కోడిగుడ్లను సరఫరా చేస్తారు. గుడ్డు పౌష్టికాహారం కావడంతో వాటిని తినేందుకు కూడా అందరూ ఇష్టపడతారు.

**గుడ్డుతో వివిధ రకాల ఆహార పదార్థాలను...**

గుడ్డుతో వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించుకునే వీలును పట్టణ పేదలకు కల్పించారు. వీరు యాభై వేల రూపాయలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. ఎగ్ మార్ట్ లను జిల్లా కేంద్రాలతో పాటు రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలు, నగరాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. మెయిన్ రోడ్లలో, ముఖ్యమైన ప్రాంతాల్లో వీరికి ఎగ్ కార్ట్ పెట్టుకునేందుకు స్థానిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అనుమతులు మంజూరు చేస్తాయి. అయితే ఈ ఎగ్ మార్ట్ లు పెట్టుకోవాలంటే ముందుగా స్వీయ ధృవీకరణ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. పదిహేను అంశాలు ఇందులో ఉంటాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకూ ఎలాంటి ప్రభుత్వ సాయాన్ని నోచుకోని వారు ఈ ఎగ్ మార్ట్ ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చంటున్నారు. ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేసి ఎగ్ మార్ట్ లను మార్చి నుంచి ఏర్పాటు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

# తమిళ సీఎం స్టాలిన్ తో జగన్ మంతనాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ తమిళనాడు సీఎం డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మధ్య అరుదైన కలయిక జరిగింది. ఈ ఇద్దరూ ఒకరిని ఒకరు పలకరించుకోవడంతో పాటు కొంత సేపు ముచ్చటించుకోవడం వర్తమాన రాజకీయాల్లో ఒక విధంగా చూస్తే హాట్ టాపిక్ గా ఉంది అని చెప్పాలి. ఎందుకంటే ఇండియా కూటమిలో స్టాలిన్ కీలకంగా ఉంటూ కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఎన్డీయేకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఇక జగన్ వైపు నుంచి చూస్తే ఆయన ఏ కూటమిలో లేరు కానీ ఏపీలో ఎన్డీయే కూటమితో పోరాడుతున్నారు. అందులోనూ ప్రత్యేకించి టీడీపీతోనే ఆయనకు రాజకీయ వైరం ఉంది. ఇదే ఇద్దరి మధ్యన తేడా. అయితే స్టాలిన్ జగన్ ల మధ్య మాత్రం మంచి స్నేహ బంధం ఉంది. అంతే కాదు ఇద్దరూ రాజకీయంగా తమ సత్తా చాటుకున్న వారే, ఇద్దరి తండ్రులూ దిగ్గజ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు. ఈ ఇద్దరూ కూడా తండ్రి వారసత్వాన్ని అంది పుచ్చుకుని తమను తాముగా రుజువు చేసుకున్న వారుగా ఉండడం విశేషం.

**అరుదైన కలయిక అక్కడ :**

జగన్ ఎవరినీ సాధారణంగా కలవరు అని చెబుతారు. ఎక్కడికీ కూడా ఆయన పెద్దగా వెళ్ళేది ఉండదు, కానీ చెన్నైకి జగన్ వెళ్ళాల్సి వచ్చింది. చెన్నైలో తన సోదరుడు వైఎస్ సునీల్ రెడ్డి కుమారుడి వివాహ వేడుకకు జగన్ వెళ్ళారు. ఇదే వివాహ వేడుకలు తమిళనాడుకు చెందిన రాజకీయ సినీ ప్రముఖులు అంతా హాజరయ్యారు. అలా వచ్చిన వారిలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఉన్నారు. అలా వేడుకకు వచ్చిన తమిళనాడు సీఎం స్టాలిన్ ను వైఎస్ జగన్ కలిశారు. కొద్దిసేపు ఇద్దరూ కూడా మాట్లాడుకున్నారు. మరి ఏమి మాట్లాడుకున్నారు అన్నది ఎవరికీ తెలియకపోయినా ఈ సన్నివేశం మాత్రం అందరికీ ఆకట్టుకుంది. వర్తమాన రాజకీయాల్లో రెండు పొరుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు కీలక ప్రాంతీయ పార్టీల అధినేతలు కలిసి కూర్చుని మాట్లాడుకోవడం అంటే దాని మీద చర్చ అయితే మొదలైపోతుంది. ఇపుడు అదే జరుగుతోంది. సోషల్ మీడియాలో ఇదే వైరల్ అవుతోంది కూడా.

**తమిళ స్టార్ సూర్యతో :**

అంతే కాదు ఈ పెళ్ళికి వచ్చిన తమిళ స్టార్ సూర్య ఆయన సోదరుడు హీరో కార్తీలతో కూడా జగన్ ఎంతో ఉత్సాహంగా గడపడం సైతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక ఈ పెళ్ళి మండపంలో జగన్ అయితే మొదటి వరసలో కూర్చున్నారు. హీరోలు సూర్య కార్తీలు రాగానే జగన్ వారిద్దరిని తానే స్వయంగా పలకరించి హగ్ చేసుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఇక ఈ ముగ్గురూ కలసి ముచ్చట్లు పెట్టడం కూడా వీడియో బైట్లను అభిమానులు సోషల్ మీడియాలో పెట్టేశారు

# ప్రభుత్వ భూమిలో ఏళ్లుగా ఉన్నా, పన్ను కట్టినా... హైకోర్టు కీలక వ్యాఖ్యలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం కోసం తమ భూములు తీసుకున్నందుకు భూ సేకరణ చట్టం – 2013 కింద పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు విజయవాడ గుణదల ప్రాంతానికి చెందిన పలువురు 2020, 2022 ప్రాంతంలో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా... ఈ భూమిలో తాము తమ పూర్వీకుల కాలం నుంచి ఉంటున్నామని తెలిపారు. దీనిపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అవును... విజయవాడలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం తీసుకున్న తమ భూములకు పరిహారం ఇప్పించాలని.. తాము అక్కడ క్రమం తప్పకుండా ఆస్తి పన్ను చెల్లిస్తున్నామని.. విద్యుత్ కనెక్షన్ తో పాటు మున్సిపల్ వాటర్ కనెక్షన్స్ కూడా ఉన్నాయని.. తాము భూమి లేని పేదలమని, ఇక్కడే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నామని.. తమ భూములు తీసుకున్నందుకు పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని.. తమకు న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా.. పిటిషనర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని.. రెవెన్యూ రికార్డుల ప్రకారం అక్కడ శ్మశానవాటిక, కాలువ ఉన్నాయని తెలిపారు. ఇదే సమయంలో... పన్నులు చెల్లించినంత మాత్రాన్న వారికి హక్కులు రావని.. వారే ఆ భూములకు యజమానులు అనేందుకు వారి వద్ద ఎలాంటి డాక్యుమెంట్లూ లేవని.. అయినప్పటికీ మానవీయ కోణంలో వారికి 114 ఇళ్లు కేటాయించామని చెబుతూ.. వారు పరిహారం పొందేందుకు అనర్హులని తెలిపారు. ఈ సమయంలో.. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్... భూ యజమానులు, ప్రభావిత కుటుంబాలకు సముచిత పరిహారం అందించడానికి భూసేకరణ చట్టం – 2013ని తీసుకొచ్చారని.. భూమి కోల్పోయినవారు నిరాశ్రయులవ్వకుండా వారి స్థితిగతులను మెరుగుపరచాలన్నది ఆ చట్టం ఉద్దేశ్యమే తప్ప.. అది ఆక్రమదారుల ప్రయోజనాల కోసం తెచ్చింది కాదని.. చట్టబద్ధ యజమానులు మాత్రమే ఈ చట్ట ప్రయోజనాలకు అర్హులని అన్నారు. ఇదే సమయంలో... ప్రభుత్వ భూమి దశాబ్దాలుగా అనుభవంలో ఉన్నప్పటికీ దానిని ఆక్రమించినవారు ఆక్రమణదారులే అవుతారు తప్ప చట్టబద్ధమైన యాజమాన్య హక్కులున్నవారితో సమానంగా పరిహారం కోరజాలరని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేశారు!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# లేడీస్ కోచ్ లో బుర్ఖా ధరించిన వ్యక్తి తప్పుడు పనులు...



**హైదరాబాద్ పెన్ పవర్:** లేడీస్–ఓన్లీ అని రాసి ఉన్న కంపార్ట్మెంట్లలోకి పురుషులు ఎవరూ ప్రవేశించకూడదనే సంగతి తెలిసిందే. ఒక వేళ ఆ తరహా పనులకు ఎవరు పాల్పడినా వారంతా వెంటనే ఘెరావ్ చేస్తారు.. పోలీసులకు ఫిర్యాదులూ వెళ్తాయి! మహిళలకు మాత్రమే అనే బోర్డు కనిపించిన తర్వాత అటు వెళ్లడానికి ఏ పురుషుడూ ప్రయత్నించకూడదు. ఈ నేపథ్యంలో మహిళలకు మాత్రమే అనే కంపార్టుమెంట్లోకి ఓ వ్యక్తి బుర్ఖా ధరించి ప్రవేశించి, మహిళా ప్రయాణికులపై లైంగిక వేధింపులకు ప్రయత్నించడం సంచలనంగా మారింది. అవును... ముంబై లోకల్ ట్రైన్ లో ఓ షాకింగ్ ఘటన తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... లేడీస్ కోచ్ లోకి ఓ వ్యక్తి బుర్ఖా ధరించి ప్రవేశించాడు. ఆ వ్యక్తి ఘట్కోపర్ స్టేషన్ సమీపంలో ఆ మహిళా కంపార్ట్ మెంట్ లో కి ప్రవేశించినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో అతడు ఆ స్పెషల్ కోచ్ లోని మహిళా ప్రయాణికులపై లైంగిక వేధింపులకు ప్రయత్నించాడని.. ఇది ఆ ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తించిందని చెబుతున్నారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఈ సమయంలో నిందితుడు రద్దీ సమయంలో మహిళల కోచ్ ఎక్కి అనుమానాస్పదంగా ప్రవర్తించాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ సమయంలో అప్రమత్తమైన ప్రయాణికులు అతన్ని ఎదుర్కొన్నప్పుడు.. తప్పించుకోవడానికి ప్రయత్నించాడని.. ఈ క్రమంలో పరిస్థితి గ్రహించి ఫైనల్ గా కదులుతున్న మరో రైలు లోకి దూకి పారిపోయాడని చెబుతున్నారు. దీంతో ఈ విషయం ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది. ఇందులో భాగంగా... ఈ సంఘటన తీవ్ర ఆగ్రహంతో పాటు మహిళల భద్రతపై ఆందోళనలకు దారి తీసింది. ఈ సమయంలో ఘట్కోపర్ పోలీస్ స్టేషన్ లో అధికారిక ఫిర్యాదు నమోదంది. మరోవైపు ఈ ఘటనపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్.పీ.ఎఫ్.) దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో నిందితుడిని గుర్తించడానికి రైల్వే స్టేషన్ తో పాటు పరిశర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలిస్తున్నారు.

# వెంకయ్య చెప్పిన నేతల 'బూతు' కథ?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాలంటే ఒకప్పుడు సిద్ధాంతాల పోరాటం.. ప్రజా సమస్యలపై చర్చలు.. హుందాతనంతో కూడిన వాదోపవాదాలు. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రత్యర్థులపై విమర్శలు చేయడంలో కనీస మర్యాదలు లోపిస్తున్నాయి. విశాఖ పర్యటనలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యక్తం చేసిన ఆందోళన కేవలం ఒక వ్యక్తి ఆవేదన కాదు.. విలువలను కోరుకునే సగటు పౌరుడి అంతర్మథనం.

**పరాకాష్టకు చేరిన వ్యక్తిగత దూషణలు**

ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ నాయకుల భాషా ప్రయోగం హద్దులు దాటుతోంది. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ప్రత్యర్థుల కుటుంబ సభ్యులను, ఆడబిడ్డలను కించపరిచే స్థాయికి దిగజారడం అత్యంత దురదృష్టకరం. బూతులు మాట్లాడటం అనేది ఒక 'ఫ్యాషన్'గా లేదా 'ధైర్యం'గా చలామణి అవుతుండటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు.

**నాటి వైభవం.. నేటి దుస్థితి**

వెంకయ్య నాయుడు గుర్తు చేసినట్లుగా అటల్ బిహారీ వాజ్‌పేయి, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్ వంటి మహోన్నత నాయకులు పార్లమెంటులో ప్రత్యర్థులను ఎండగట్టేటప్పుడు కూడా ఎంతో సంస్కారవంతంగా ఉండేవారు. ఆ మాటల్లో పదును ఉండేది కానీ పరుషత్వం ఉండేది కాదు. నేటి తరం నాయకులు మీడియా దృష్టిని ఆకర్షించడమే పరమావధిగా భావిస్తూ నిమిషం పాటు వైరల్ అవ్వడం కోసం ఏళ్ల తరబడి సంపాదించుకున్న గౌరవాన్ని పణంగా పెడుతున్నారు.

**పరిష్కారం ఎక్కడ ఉంది?**

ఈ 'భాషా కాలుష్యాన్ని' అరికట్టడానికి వెంకయ్య నాయుడు మూడు ప్రధాన మార్గాలను సూచించారు. నాయకులు తమ హోదాను, బాధ్యతను గుర్తించి మాట్లాడాలి. విమర్శ అనేది విధానపరంగా ఉండాలి తప్ప, వ్యక్తిగత దూషణగా మారకూడదు. బూతులు మాట్లాడే వారిని, అనవసర రాద్ధాంతం చేసే వారిని ప్రోత్సహించడం మానుకోవాలి. అలాంటి ప్రసంగాలకు ప్రచారాన్ని తగ్గించినప్పుడే నాయకుల్లో మార్పు వస్తుంది. ఇది అత్యంత శక్తివంతమైన ఆయుధం. నోటికొచ్చినట్లు మాట్లాడే నాయకులకు ప్రజలు పోలింగ్ బూత్‌లోనే సరైన సమాధానం చెప్పాలి. తమ ఓటు ద్వారా అరాచక భాషకు చరమగీతం పాడాలి. ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది ఒక వరం. కానీ అది అసభ్యతగా మారినప్పుడు వ్యవస్థకే ప్రమాదం. రాజకీయ నాయకులు తమను తాము సంస్కరించుకోకపోతే భవిష్యత్ తరాలకు మనం తప్పుడు సందేశాన్ని అందించిన వాళ్లమవుతాం. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు తమ నాయకులకు 'భాషా సంస్కారం'పై శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. విలువలతో కూడిన రాజకీయాల కోసం పౌర సమాజం గొంతు విప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

# క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏంటీ? దాంతో ఏంటి ప్రయోజనం?


**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్త చరిత్రకు వేదికైంది. ఐటీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు అమరావతిని భవిష్యత్ టెక్నాలజీ 'క్వాంటం కంప్యూటింగ్'కు గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేశారు. శనివారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో దేశంలోనే మొట్టమొదటి 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**సిలికాన్ వ్యాలీ గతం.. క్వాంటం వ్యాలీ వర్తమానం!**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "గతంలో సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాంది పలికితే రాబోయే రోజుల్లో క్వాంటం వ్యాలీ ప్రపంచాన్ని శాసించబోతోంది. హైదరాబాద్‌కు హైటెక్ సిటీ ఎలాగో, దేశానికి అమరావతి క్వాంటం వ్యాలీ అలా గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో దేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తెస్తాం" అని ప్రకటించారు.

**ప్రాజెక్టు ప్రత్యేకతలు:**

సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. 48 అంతస్తులు, 29 అంతస్తులతో కూడిన ఎనిమిది భారీ టవర్లను నిర్మిస్తున్నారు. ఐబీఎం , టీసీఎస్ , ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. 2030 నాటికి దేశానికి అవసరమైన 2.5 లక్షల క్వాంటం నిపుణులలో మెజారిటీ వాటా అమరావతి నుంచే ఉండేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు.



**ఎందుకు ఈ క్వాంటం టెక్నాలజీ?**

సాధారణ కంప్యూటర్లు సంవత్సరాల తరబడి చేసే క్లిష్టమైన లెక్కలను క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. దీనివల్ల వాతావరణ అంచనాలు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కొత్త మందుల తయారీ, హ్యాకింగ్‌కు గురికాని సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

**అరుదైన పురస్కారం.. ₹100 కోట్ల బహుమతి!**

పరిశోధనలను ప్రోత్సహించేందుకు చంద్రబాబు ఒక సంచలన ప్రకటన చేశారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఎవరైనా నోబెల్ బహుమతి సాధిస్తే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ₹100 కోట్ల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అమరావతే నాలెడ్జ్ హబ్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ సిందూర్ దెబ్బ.. పాక్ ఇంకా కోలుకోలేదు ఇదే సాక్ష్యం అబ్బా!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏప్రిల్ 22 - 2025న పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులు ఆహ్లాద వాతావారణంలో ఉండగా.. మారణహోమం సృష్టించిన పాకిస్థాన్ పెంచి పోషిస్తోన్న ఉగ్రవాదులు.. 26 మందిని మతం కనుక్కుని మరీ హతమార్చిన సంగతి తెలిసిందే! దీంతో.. మే 7 - 2025న అర్ధరాత్రి పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని సుమారు 10 కీలక ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. అనంతరం సరిహద్దుల్లో ఘర్షణ వాతావరణ నెలకొంది. ఆ సమయంలో భారత్ కొట్టిన దెబ్బ నుంచి పాక్ ఇంకా కోలుకోలేదనే సాక్ష్యాలు తాజాగా తెరపైకి వచ్చాయి. అవును... ఆపరేషన్ సిందూర్ సమయంలో మే 10 - 2025న భారత వైమానిక దళం (ఐఏఎఫ్) జరిపిన దాడిలో పాకిస్థాన్ వైమానిక స్థావరంలోని హాంగర్ ధ్వంసమైంది. ఈ విషయాన్ని శాటిలైట్ చిత్రాలు అప్పుడు స్పష్టం చేశాయి. అయితే ఆ దాడి జరిగి సుమారు 10 నెలలు కావొస్తున్నా ఇప్పటికీ ఆ హాంగర్ కు జరిగిన నష్టాన్ని పునర్నిర్మించడం లేదా మరమ్మతులు చేయడం జరగలేదనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించిన తాజా శాటిలైట్ చిత్రాలను జాతీయ మీడియా వెల్లడించింది. ఇది వైరల్ గా మారింది. తాజా నివేదికలో.. ఈ ఏడాది జనవరి 28న తీసిన చిత్రాల్లో హాంగర్ కి సంబంధించి దెబ్బతిన్న రూఫ్ భాగాలు తొలగించినట్లు చూపిస్తున్నాయి. ఇదే క్రమంలో దెబ్బతిన్న పైకప్పును పాక్షికంగా కూల్చివేసినట్లు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో... భారత వైమానిక దళం దెబ్బకు దెబ్బతిన్న ఇతర స్థావరాల వద్ద పరిస్థితి ఇలానే ఉందని అంటున్నారు. దీంతో నాడు భారత్ కొట్టిన దెబ్బ నుంచి పాకిస్థాన్ ఇంకా కోలుకోలేదనే చర్చ మళ్లీ మొదలైంది. దీనిపై పాక్ నుంచి రియాక్షన్ రావాల్సి ఉంది! కాగా... మే 10 - 2025న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య భోలారి వద్ద ఉన్న హాంగర్ పై దాడి జరిగింది. ఆ సమయంలో భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడానికి పాకిస్థాన్ ఎయిర్ ఫోర్స్ ప్రయత్నించగా.. దానికి ప్రతిస్పందనగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్, పాకిస్థాన్ స్థావరాలపై దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలోనే నేరుగా ఇస్లామాబాద్ ను టచ్ చేసింది.. భోలారీపైనా దాడి చేసింది. ఆ సమయంలో ఐఏఎఫ్ ఎయిర్ టు సర్ఫేస్ మందుగుండు సామాగ్రిని ఉపయోగించినట్లు చెబుతున్నారు! వీటిలో.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని ఉగ్ర స్థావరాలపై దాడి సమయంలో సుఖోయ్ లపై బ్రహ్మోస్ ఎయిర్ టు సర్ఫేస్ క్షిపణులను ఉపయోగించి ఉండొచ్చని అంటుండగా.. ఘర్షణ పెరిగిన తర్వాత రాఫెల్ యుద్ధ విమానాలపై ఫ్రెంచ్ క్షిపణులు.. సుఖోయ్ యుద్ధ విమానాలపై ఇజ్రాయెల్ రాంపేజ్ క్షిపణులు.. మిరాజ్ 2000లపై ఇజ్రాయెల్ క్రిస్టల్ మేజ్ క్షిపణులను ఉపయోగించినట్లు భావిస్తున్నారు! ఈ దెబ్బ తగిలిన కొన్ని గంటల్లోనే.. అంటే.. మే 10వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) కాషిఫ్ అబ్దులా నుంచి భారత డీజీఎంఓ, లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ కు హాట్ లైన్ లో విజ్ఞప్తి వచ్చింది! దీంతో.. ఆరోజు సాయంత్రం 5 గంటల తర్వాత తక్షణ కాల్పుల విరమణ జరిగింది. దీంతో.. పాకిస్థాన్ ఊపిరి పీల్చుకుంది. కానీ.. నాడు తగిలిన దెబ్బ నుంచి ఇంకా కోలుకోలేదని తాజా చిత్రాలు చెబుతున్నాయి!

# నాడు మరమరాలు అమ్మాడు.. ఇప్పుడు జ్యోతిషుడై వందల కోట్లు సంపాదించాడు!

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటలో ఫుల్ ఫేమస్ అయిన ఓ జ్యోతిషుడి వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో వివాహేతర సంబంధంపై జరిగిన హింసాత్మక ఘర్షణలో ఒక వ్యక్తిని హత్య చేశాడనే ఆరోపణలపై ఈ జ్యోతిషుడు కమలాకర్ భట్ తో పాటు మరో ముగ్గిరిని పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఆ ముగ్గురూ.. సుచిత్రా నాయక్, లోకనాథ్, ఆకాష్ లుగా గుర్తించారు. ఈ సమయంలో ఈ జ్యోతిషుడి ఫ్లాష్ బ్యాక్ ఆసక్తిగా మారింది.

అవును... ఉత్తర కన్నడ జిల్లా సిద్ధాపూర్ కి చెందిన కమలాకర్ భట్ 2005కి ముందు గ్రామాల్లోనూ, జాతరల్లోనూ తమలపాకులు, మరమరాలు అమ్మేవాడట. ఈ క్రమంలో తనకు తెలిసినవారొకరు జోతిష్యం నేర్చుకోమని సలహా ఇచ్చాడట. దీంతో.. వెంటనే కేరళ వెళ్లి అక్కడ జోతిష్యం నేర్చుకున్న కమలాకర్ భట్.. అనంతరం గ్రామానికి తిరిగి వచ్చి ఆ వృత్తిని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో మరింతగా ఫేమస్ అవ్వడం కోసం టీవీ కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రారంభించాడు. ఈ క్రమంలో అతని అదృష్టం ఒక్కసారిగా మారిపోయింది. అతని వద్ద జాతకాలు చెప్పించుకున్నవారి సంగతేమో కానీ.. ఇతడి జాతకం మాత్రం ఒక్కసారిగా మారిపోయింది. ఈ క్రమంలో అతడు సుమారు వందల కోట్ల రూపాయలు సంపాదించినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో.. బెంగళూరు, శివమొగ్గ, హుబ్బళ్లి లో ఆఫీసులు తెరిచాడని.. వీటికోసం నెలకు సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేస్తున్నాడని చెబుతున్నారు. అతని వద్ద ఏజెంట్లూ ఉన్నారని చెబుతున్నారు.

ఈ క్రమంలో సమస్యలున్నవారిని తీసుకొచ్చిన ఏజెంట్లకు కమిషన్లు ముట్టచెబుతాడని అంటున్నారు. ఈ క్రమంలోనే తొలుత తన వద్దకు జాతకం చెప్పించుకోవడానికి వచ్చి, అనంతరం ఏజెంట్ గా మారిన సుచిత్ర నాయక్ అనే మహిళతో అక్రమ సంబంధం సాగించడం మొదలుపెట్టాడని చెబుతున్నారు. ఈ సమయంలో అందుకు అడ్డుగా ఉన్న ఆమె భర్తపై దాడి చేయించగా.. ఈ దాడిలో ఆమె భర్త సోదరుడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు! దీంతో.. కమలాకర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.



**అసలేం జరిగింది..?:**

సుచిత్ర అనే మహిళ సుమారు 15 ఏళ్ల క్రితం మహేష్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో ఆ కుటుంబం కొంతకాలం బెంగళూరులో నివసించింది. ఈ క్రమంలోనే సుచిత్ర, కమలాకర్ భట్ ను కలిసిందని.. ఆ తర్వాత ఆమె తిరిగి గ్రామానికి వెళ్లిపోయినా వీరి మధ్య స్నేహం చిగురించి, పెరిగిందని.. దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో సుచిత్ర తన పిల్లలతో శివమొగ్గకు వెళ్లి అక్కడ కమలాకర్ భట్ తో నివసించిందట. ఈ క్రమంలో వెలుగులోకి వచ్చిన కొన్ని ఆడియో ఫైల్స్ లో... వీరి బంధానికి పిల్లలు అడ్డుగా ఉన్నారనే చర్చా జరిగినట్లు తెలుస్తోంది. దానికి తోడు.. తనకు తన తల్లితో ఉండటం చాలా ఇబ్బందిగా ఉందని, తనను నిత్యం ఆమె తిడుతూ, కొడుతూ వేధిస్తుందని.. ఆమె కుమార్తె తన తండ్రి మహేష్ కు తెలిపింది. దీంతో.. ఆమెను తీసుకుని సిద్ధాపుర పోలీస్ స్టేషన్ కు వెళ్లిన మహేష్.. సుచిత్రపై ఫిర్యాదు చేయించాడు. అనంతరం ఇంటికి తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలోనే సుచిత్ర, ఆమె తండ్రి లోకనాథ్, ఆకాష్ లు కత్తులు, ఆయుధాలు తీసుకుని మహేష్ ఇంటికి చేరుకుని గొడవకు దిగారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో అతనిపై కత్తితో దాడి చేసే సమయంలో.. మహేష్ ను కాపాడటానికి ప్రయత్నించిన అతని సోదరుడు వసంత్ నాయక్ కు కత్తిపోట్లు తగిలాయి. ఇదే సమయంలో.. మహేష్ తో పాటు అతని స్నేహితుడు కుమార్ నాయక్ కూడా గాయపడ్డారు. ఈ క్రమంలో వీరి ముగ్గురూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వసంత్ నాయక్ మరణించాడు!


## లెమన్ రైస్ చేదు వస్తోందా?



దక్షిణ భారతదేశంలో అత్యంత ఆదరణ పొందిన వంటకం 'లెమన్ రైస్'. దీన్నే నిమ్మకాయ పులిహోరగా తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా ఇష్టపడుతుంటారు. దీని తయారీ చూడటానికి చాలా సులభంగా అనిపించినా, చాలా మంది చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల ఇది చేదుగా మారుతుంది లేదా అన్నం గట్టిగా అయిపోతుంది. సెలబ్రిటీ షెఫ్ రణవీర్ బ్రార్ తన తాజా ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో లెమన్ రైస్‌ను పర్ఫెక్ట్‌గా ఎలా తయారు చేయాలో మూడు స్మార్ట్ టిప్స్ పంచుకున్నారు. అన్నం మెత్తగా ఉండటంతో పాటు, నిమ్మకాయ పులుపు మరియు పోపు దినుసుల సువాసన సరిగ్గా కుదరాలంటే మ్యానిప్యులేషన్ చాలా ముఖ్యం. నిమ్మరసం కలిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల నుండి, దీనికి ఏ సైడ్ డిష్ బాగుంటుందనే వరకు రణవీర్ బ్రార్ వివరించిన ఆసక్తికర విషయాలు ఇప్పుడు చూద్దాం. ఈ చిట్కాలను పాటిస్తే మీ ఇంటి లెమన్ రైస్ కూడా రెస్టారెంట్ స్టైల్‌లో అదిరిపోతుంది.

షెఫ్ రణవీర్ బ్రార్ పంచుకున్న 3 స్మార్ట్ టిప్స్: ఎక్కువగా ఫ్రై చేయకండి: మనం చేసేది 'ఫ్రైడ్ రైస్' కాదు కాబట్టి, అన్నం వేసిన తర్వాత నూనెలో మరీ ఎక్కువగా వేయించకూడదు. అలా చేస్తే అన్నం గట్టిగా మారుతుంది. అన్నం వేసిన తర్వాత కొద్దిగా నీటి చుక్కలను చల్లి, 'దమ్' లాగా చేస్తే అన్నం పొడిపొడిగా, మృదువుగా ఉంటుంది. నీళ్లు, నిమ్మరసం : నిమ్మరసం కలిపిన వెంటనే కొద్దిగా నీళ్లు కలపాలి. లేదా అన్నం కొంచెం చల్లారిన తర్వాత (గది ఉష్ణోగ్రత వద్ద) నిమ్మరసం కలపాలి. వేడి వేడి అన్నం లేదా మరుగుతున్న పోపులో నిమ్మరసం వేస్తే అది ఆవిరైపోయి చేదు రుచి వచ్చే అవకాశం ఉంటుంది. సరైన కాంబినేషన్ : లెమన్ రైస్‌ను కొబ్బరి పాలు లేదా కొబ్బరి తురుముతో చేసే గ్రేవీ కూరలతో తింటే అద్భుతంగా ఉంటుంది. నిమ్మకాయ పులుపుకు, కొబ్బరిలోని క్రీమీ రుచి తోడై ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. రెస్టారెంట్ స్టైల్ లెమన్ రైస్ తయారీకి కావలసినవి: నువ్వుల నూనె, ఆవాలు, మినపప్పు, శనగపప్పు, కరివేపాకు, ఎండుమిర్చి, పచ్చిమిర్చి, జీడిపప్పు, వేరుశెనగ గుళ్లు, పసుపు, ఉప్పు, నిమ్మరసం, అన్నం.

## ఉడికించిన గుడ్డు, ఆమ్లెట్ ఇందులో ఏది మంచిది



ఫిట్‌నెస్, ప్రోటీన్ పట్ల స్పృహ ఉన్న వ్యక్తులు ఉడికించిన గుడ్లు లేదా ఆమ్లెట్.. ఇందులో ఏది మంచిది..? అని తరచూ సందేహం వ్యక్తంచేస్తుంటారు. అసలు బరువు తగ్గే.. లేదా బరువు పెరిగే ప్రయాణంలో ఏది మంచిది.. కండరాల నిర్మాణానికి ఏది ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది? ఉరుకులు పరుగుల ప్రస్తుత కాలంలో చాలామంది పలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి ఎక్కువగా తెలుసుకుంటున్నారు.. అంతేకాకుండా అవగాహనను పెంచుకుంటున్నారు. తత్ఫలితంగా, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అనుసరించాలని కోరుకుంటారు. ముఖ్యంగా ఫిట్‌నెస్ ఔత్సాహికులు, జిమ్‌కు వెళ్లేవారు.. తమ ప్రోటీన్ తీసుకోవడం గురించి ప్రత్యేకంగా ఆందోళన చెందుతారు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రోటీన్ ను భర్తీ చేయడానికి గుడ్లను వారి ఆహారంలో చేర్చుకుంటారు. గుడ్డులో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. గుడ్డు మంచిదే కానీ.. దీని విషయంలో ఓ సందేహం కూడా దాగుంది.. ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లెట్ తినడం.. ఇందులో ఏది ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది..? అనే దానిపై ప్రజలు తరచుగా గందరగోళానికి గురవుతుంటారు. అయితే.. బరువు తగ్గడానికి, బరువు పెరగడానికి గుడ్లు ఎలా తినాలి..? డైటీషియన్లు ఏం చెబుతున్నారు.. ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లెట్ మంచిదా..? మీరు బరువు తగ్గాలని చూస్తున్నట్లయితే.. ఉడికించిన గుడ్లు ఉత్తమ ఎంపికగా పరిగణించబడతాయి. ఉడికించిన గుడ్లలో నూనె లేదా కొవ్వు ఉండవు.. కాబట్టి వాటిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. వాటిలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది.. ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది.. ఇది తరచుగా ఆకలి బాధలను నివారిస్తుంది. ప్రతిరోజూ అల్పాహారంగా ఒకటి నుండి రెండు ఉడికించిన గుడ్లు తినడం వల్ల మీ జీవక్రియ పెరుగుతుంది. ఇది కొవ్వును కాల్చేస్తుంది. అందువల్ల, ఉడికించిన గుడ్లు తినడం ముఖ్యంగా ఆహారంలో ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. మరోవైపు, మీరు బరువు పెరగాలని చూస్తున్నట్లయితే, ఆమ్లెట్ మంచి ఎంపిక కావచ్చు. నూనె, వెన్న, ఉల్లిపాయలు, టమోటాలు.. కొన్నిసార్లు జున్ను కూడా దీని తయారీలో ఉపయోగించవచ్చు. ఇది దాని క్యాలరీ కంటెంట్‌ను పెంచుతుంది.. ఇలా బరువు పెరగడానికి దోహదం చేస్తుంది. అందువల్ల, వ్యాయామం చేసే వ్యక్తులు, ఆమ్లెట్‌లు తినడం వల్ల వారికి ఎక్కువ శక్తి లభిస్తుంది.. ఇది కండరాలను నిర్మించడంలో సహాయపడుతుంది. ఆమ్లెట్‌లను సరైన మొత్తంలో తినడం వల్ల మీరు ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగవచ్చు.


## వరుసగా రెండో రోజు పతనమైన బంగారం.. రూ. 13,000 తగ్గిన కిలో వెండి..



దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా రెండో రోజు కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. అంతర్జాతీయంగా పరిస్థితులు మారడం, పెట్టుబడిదారులు లాభాల కోసం ప్రాఫిట్ బుకింగ్ ఇందుకు ప్రధాన కారణం. దింతో కిలో వెండి ధర ఏకంగా రూ. 13,000 తగ్గి రూ. 2,68,000 నుంచి రూ. 2,55,000కు పడిపోయింది. అంటే దాదాపు 5 శాతం తగ్గుదల. ఇక 10 గ్రాముల బంగారం ధర రూ. 3,400 తగ్గి రూ. 1,60,600 ఉన్న ధర ఇప్పుడు రూ. 1,57,200కు చేరుకుంది.బంగారం ధరలు భారీగా పెరగడంతో, చాలామంది లాభాలను క్యాష్ చేసుకోవడానికి అమ్మకాలు మొదలుపెట్టారు. దీనివల్ల దేశీయంగా ధరలు తగ్గాయి. అమెరికా, ఇరాన్ మధ్య చర్చల్లో పురోగతి కనిపిస్తుందన్న ఆశలతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావం కూడా బంగారం ధరలపై పడింది.ఒమన్‌లో జరుగుతున్న చర్చలు, అమెరికా ఆర్థిక విధానాల వల్ల మార్కెట్లో భారీ ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా ఒకానొక దశలో బంగారం, వెండి ధరలు 10 శాతం వరకు పడిపోయినప్పటికీ, ఆ తర్వాత మళ్లీ కొంత పుంజుకున్నాయి. విదేశీ మార్కెట్‌లో బంగారం ఔన్సుకు 4,887 డాలర్ల వద్ద, వెండి 74 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

# స్నేహం ఎలా చేయాలో తెలుసుకోండి.. ఏనుగుతో చిన్నారి ఫ్రెండ్ షిప్

"ఏనుగమ్మ ఏనుగు...
పొడుగు తొండం ఏనుగు
పొట్టి తోక ఏనుగు
చేట చెవుల ఏనుగు"



అని ఊర్లోని పిల్లలు రాములవారి గుడికాడ ఆడుతూ పాడుతూ ఉన్నారు.పొట్టి నిక్కరు, తెల్ల బనియను వేసిన నాలుగేళ్ళ రంజీ కూడా వారితోపాటు ఎగురుతూ పాడుతూ ఉన్నాడు.అప్పుడే.. ఊర్లోకి వచ్చింది నల్ల రంగు ఏనుగు. దాని మెడలో గంటల గొలుసు ఉంది.

ఏనుగును చూసి పిల్లలందరూ పరుగో... పరుగు. ఎందుకంటే వాళ్లెప్పుడూ నిజం ఏనుగును చూసి ఎరుగరు. పుస్తకాల్లో చూసింది. సినిమాల్లో చూసింది తప్పితే.ఎప్పుడూ ఏనుగును చూడని రంజీకి మాత్రం ఏనుగును చూసి ముచ్చటేసింది. దానికేదైనా బహుమతి ఇవ్వాలనిపించింది. ఇంటికెళ్లి బహుమతి తీసుకొచ్చేలోగా అది వెళ్ళిపోతుందేమోనని అనుమానం వేసింది. చుట్టూరా చూశాడు. ఇవ్వడానికి ఏదీ అందుబాటులో లేదు. 'అయ్యో...' అని బాధగా నిక్కరు మీద తట్టాడు. నిక్కరు జేబులోని అమ్మమ్మ ఇచ్చిన అరటిపండు, చేతికి తగిలింది. ఆనందంతో భుజాలు ఎగరేశాడు. గబగబా దాన్ని బయటికి తీశాడు. పరిగెత్తుకెళ్లి ఏనుగు దగ్గర నిలబడ్డాడు. ఓరకంటితో ఏనుగు రంజీని చూసింది. రంజీ చేతిలోని అరటిపండు దానికి కనిపించింది. చటుక్కున ఆగింది. రంజీ అరటిపండును ఒలిచి ఏనుగుకు ఇవ్వబోయాడు. తొక్క తీయొద్దని తలను ఆడిస్తూ సైగ చేసింది. అర్థం చేసుకున్న రంజీ తొక్క తీయడం ఆపేశాడు. ఏనుగుకు అరటిపండు అందించాడు. తొండంతో తీసుకుని నోట్లో పెట్టుకుంది. దాని దగ్గరకు వెళ్లబోయాడు. దూరంగా ఉన్న పిల్లలు 'వద్దు వద్దు' అని అరిచారు. అయినా రంజీ వారి మాటలు వినలేదు. దానికి మరింత దగ్గరగా చేరాడు. 'వీడి పని అయిపోయింది' అనుకున్నారు పిల్లలు. కానీ వాళ్లు అనుకున్నట్లు జరగలేదు.

అది రంజీని ఏమీ అనలేదు. తొండం పైకెత్తి ఆశీర్వదించింది. తన మెడ గొలుసు కింద దాచిన చిన్న వెలగ పండును తొండంతో తీసి రంజీ చేతికి ఇచ్చింది. రంజీ ఖుషీ అయ్యాడు. దూరంగా నిలబడి ఉన్న పిల్లలు ఆశ్చర్యపోయారు. 'భలే భలే' అని అరిచారు. పెద్దపెద్ద అడుగులు వేస్తూ, తోక ఆడిస్తూ ఏనుగు అక్కడినుంచి కదిలింది. వెళ్తున్న ఏనుగును చూసి 'ఏనుగు వెళ్ళిపోతోంది. మనకిక భయం లేదు' అనుకున్నారు మిగిలిన పిల్లలు. పరిగెత్తుకుంటూ రంజీ దగ్గరకు వచ్చారు. 'ఏనుగు దగ్గరగా వెళ్లావు. స్నేహితుడికి ఇచ్చినట్లు అరటిపండు ఇచ్చావు. నీకు భయం వేయలేదా? అని అడిగారు."భయం దేనికి? అది మన శత్రువు కాదు కదా!" అని ఎదురు ప్రశ్న వేశాడు రంజీ.'నిజమే... ఏ జంతువైనా మనం మచ్చిక చేసుకుంటే మనతో స్నేహం చేస్తుంది' అని తెలుసుకున్నారు పిల్లలు. ఇంతలో దూరంగా గున్న ఏనుగును తోలుకుని వస్తూ మావటివాడు కనిపించాడు వారికి. మచ్చిక చేసుకున్న ఏనుగులను ఊరూరా తిప్పి పల్లె ప్రజలకు వాటిని చూపిస్తూ డబ్బు, ధాన్యం గడించేవాడు ఆ మావటివాడు. అంతే... పిల్లలు ఇండ్లల్లోకి పరుగులు తీశారు. బియ్యం, రాగులు, బెల్లం, చెరుకుగడలు లాంటివి పట్టుకొచ్చి గున్న ఏనుగుకు ఇచ్చారు. చెవుల్ని టపటపా ఆడిస్తూ ఆ గున్న ఏనుగు పిల్లలిచ్చిన అన్ని తిండి బహుమతుల్నీ తొండంతో తీసుకుని నోట్లో పెట్టుకుంది. పిల్లలందరూ ఎగురుతూ 'ఏనుగమ్మ ఏనుగు..' అని పాడుతూ గున్న ఏనుగు వెంటబడి నృత్యం చేశారు.

## ఆధ్యాత్మికం : గుళ్లో ప్రసాద తీర్థంలో .. తులసి ఆకు కలవాల్సిందే.. ఎందుకో తెలుసా..!



భగవంతుని ప్రసాదం అంటే తీర్థం. దీనిలో తులసీదళం లేకుండా అది అసంపూర్ణం అవుతుందంటారు. అయితే తీర్థంలో తులసి ఆకులను ఎందుకు వేస్తారో తెలుసా?

హిందూ ధర్మంలో తులసి మొక్కకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. తులసి మొక్క ఉన్న ఇంట్లో లక్ష్మీమాతతో పాటు విష్ణుమూర్తి కూడా కొలువైవుండి, వారి ఆశీస్సులు అందిస్తారని చెబుతారు. దేవాలయాల్లో తీర్థాన్ని రాగి లేదా ఇత్తడి పాత్రలో స్వచ్ఛమైననీటిని తీసుకుని, దానికి గంగాజలం, తులసి దళాన్ని జోడించాక ఆ నీరు అమృతం వలె పవిత్రంగా, మరింత స్వచ్ఛంగా మారుతుంది.విష్ణువు అవతారమైన శ్రీ కృష్ణునికి తులసి చాలా ప్రియమైనది. అందుకే తీర్థంలో అందుకే తులసి దళాన్ని వేస్తారు. పంచామృతంలో కూడా తులసి దళాన్నివేస్తారు. తీర్థంలో తులసి దళాన్ని వేయడానికి ఇదే కారణం. కాగా సూర్యుడు అస్తమించిన తర్వాత కూడా తులసి ఆకులను ముట్టకూడదంటారు.తులసి మాతకు పరిశుభ్రత అంటే చాలా ఇష్టమనే విషయాన్ని గుర్తుంచుకోండి. తులసిని సరిగా సంరక్షించకపోతే తులసి ఆకులు ఎండిపోతాయి. మంగళ, ఆదివారాల్లో తులసి ఆకులను కోయకూడదు. హిందూమతంలో తులసికి తల్లి ప్రత్యేక స్థానం సనాతన ధర్మంలో తులసి మహిమ అపారమైనది. పూజా పాత్ర, ప్రసాదంలో తులసి దళానికి ప్రత్యేక స్థానం ఉందని పండితులు చెబుతున్నారు. అందుకే మంగళ, ఆదివారాల్లో తులసి ఆకులను కోయకూడదు.ఇంకా అనేక వ్యాధులకు తులసి ఆకు నమిలితే మంచి ఔషధమని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కఫం.. దగ్గు... శ్లేష్మంమొదల వ్యాధులను తులసి తగ్గిస్తుంది. అజీర్ణం చేస్తే అల్లం రసాన్ని వేడిచేసి అందులో తులసి ఆకు రసాన్ని కలుపుకొని తాగితే ఇట్టే తగ్గుతుంది. తులసి ఆధ్యాత్మికమే కాదు.. ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగమని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే దేవాలయాల్లో తీర్థంలో తప్పనిసరిగా తులసి ఆకును ఉంచుతారు.

## జీవిత సత్యం : ఒంటరిగా ఉంటేనే లైఫ్ లో సక్సెస్ అవుతారు..ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన నిజం ఇదే..!



ప్రతి ఒక్కరు జీవితంలో ఎదగాలని.. ఉన్నత స్థితిని చేరుకోవాలని..అందరితో గౌరవించబడాలని.. కోరుకుంటారు. కనీసం వారు పనిచేసే రంగంలోనైనా ఉన్నత స్థితిని చేరాలనుకుంటారు.. లైఫ్ లో ఎదగాలనుకొనే వారు తెలుసుకోవలసిన విషయాలను ఈస్టోరీలో చూద్దాం. . .

ఒంటరి తనమే జీవితంలో ఎదిగేందుకు అసలైన టెస్ట్. ఈ టెస్ట్ లో పాస్ అయితేనే నువ్వు సక్సెస్ కి అర్హుడివి. నువ్వు ఒంటరిగా కూర్చుని నిన్ను నువ్వు క్రమశిక్షణలో పెట్టుకుంటే, నీ మెదడు స్టీల్ లా మారుతుంది. నీ గుండె ఒక రాయిలా తయారవుతుంది. నీ లక్ష్యం నీకు క్లియర్‌గా కనిపిస్తుంది.

ప్రతి మనిషికి ఏదో రంగంలో నైపుణ్యత ఉంటుంది. దానిని గుర్తించి.. సద్వినియోగపర్చుకున్నవారు జీవితంలో ఉన్నతస్థితిని చేరుకుంటారు. ప్రతి మనిషి ఎదుగుదలకు ఒక ధర ఉంది. ఆ ధర డబ్బు కాదు.. కీర్తి కాదు, నీ ఎనర్జీ మాత్రమే కాదు. ఆ ధర పేరు ఒంటరితనం. ఈ మాట వినగానే షాక్ అయ్యారా... సక్సెస్ వస్తే చుట్టూ వంద మంది ఉంటారు.. అందరూ చప్పట్లు కొడతారు అని కలలు కంటున్నావా? ఆ ఆలోచన వినడానికి చాలా క్యూట్‌గా ఉంటుంది కానీ, అది పచ్చి అబద్ధం. నిజంగా ఎదిగేవాడు ఎప్పుడూ ఒంటరిగానే ఉంటాడు. ఎందుకంటే, ఒంటరిగా ఎదిగినవాడు మాత్రమే టీమ్ లీడర్ గా వ్యవహరించగలడు. నీవు ఎదగడం మొదలుపెట్టగానే నీ చుట్టూ ఉన్న జనం పలచబడతారు. ఇలా ఎందుకు జరుగుతుందని ఎప్పుడైనా ఆలోచించావా... ఎందుకంటే నువ్వు మారిపోతావు. నీ మాటలు మారుతాయి, నీ ఆలోచనా విధానం మారుతుంది. నీ టైమ్ విలువ నీకు అర్థమవుతుంది. అప్పుడు నీ పాత ఫ్రెండ్స్‌కి, నీ చుట్టూ ఉన్న వాళ్ళకి నువ్వు నచ్చవు. అందుకే అందరూ నీకు దూరంగా ఉంటారు. వాళ్లను వదిలేసి మీ లక్ష్యంపై దృష్టి పెట్టిన వారు జీవితంలో సక్సెస్ అవుతారు. నీ ప్రయారిటీస్ మారినప్పుడు వాళ్ళు ఎందుకు నీతో ఉండాలని మీకు మీరే ప్రశ్నించుకోవాలి.. మన వర్క్ లో మనం బిజీగా ఉంటే... టైమ్ పాస్ చేసే వాళ్ళకి.. ముచ్చట్లు చెప్పి కాలక్షేపం చేసేవారికి ఆటోమేటిక్ గా మీరు శత్రువులు అవుతారు.ఈ విషయాన్ని గుర్తించి అలాంటి వారితో హాయ్ అంటే హాయ్ .. బై.. అంటే బై గా ఉండండి.. వారి మాటలను అస్సలకు పట్టించుకోవద్దని నిపుణులు చెబుతున్నారు.

నువ్వు ప్రతి విషయంలో అప్డేట్ అవుతుంటే, పాత పద్ధతుల్లోనే ఉన్న వాళ్ళకి నువ్వు ఒక అహంకారిలా కనిపిస్తావు .. వారు చెప్పేది వినకుండా నీపని నీవు చేసుకుంటావు. అప్పుడు మీ స్నేహితులు నువ్వు మారిపోయావు అంటూ అందరూ నిన్ను అవమాన పరుస్తుంటారు.కాని నువ్వు మారకపోతే నీ లైఫ్ ఎలా మారుతుంది? అనే విషయాన్ని గుర్తించాలి. నువ్వు గతంలో మాదిరిగా ఉంటేనే వాళ్ళకి కంఫర్ట్. నువ్వు ప్రతి విషయాన్ని ప్రస్తుత జనరేషన్.. టెక్నాలజీ ఆధారంగా పూర్తిగా తెలుసుకొంటే వాళ్ళ ఈగోకి అది ఒక పెద్ద దెబ్బగా మారుతుంది. అలాంటప్పుడు . నీ ఎదుగుదల వాళ్ళ అసమర్థతను గుర్తు చేస్తుంది. అందుకే వాళ్ళు నిన్ను వదిలేసి వెళ్ళిపోతారు. దానికి నువ్వు బాధపడకుండా సెలబ్రేట్ చేసుకోవాలి. నీ క్రమశిక్షణ స్ట్రాంగ్‌గా ఉంటే, బలహీనమైన మనస్తత్వం ఉన్న వాళ్ళు నిన్ను అసహ్యించుకుంటారు. ఎందుకంటే.. నీ డిసిప్లిన్ వాళ్ళకి ఒక అద్దం లాంటిది. అందులో వాళ్ళ బద్ధకం, వాళ్ళ నిర్లక్ష్యం కనిపిస్తాయి. నీ రొటీన్ వాళ్ళ సోమరితనానికి రిమైండర్ అయిపోతుంది .

నీ ఫోకస్.. నీవు చేస్తున్న వర్క్ మీద ఉంటుంది. రాత్రింబవళు ళ్ళ కూర్చుని వర్క్ చేస్తుంటే... వాళ్ళకి నిద్ర ఎలా పడుతుంది? మీరు కొత్త స్కిల్ నేర్చుకుంటుంటే.. వాళ్ళకు అన్ ఈజీగా ఉంటుంది కదా.. మీరు వాళ్లను కాదని ఏదో చేస్తుంటారు.. కొన్ని విషయాలను నేర్చుకుంటున్నారు కదా..! వాళ్ల అప్ డేట్‌కావడం లేదనుకోరు.. ఇలాంటి పరిస్థితిలో వారికేం చేయాలో తెలియక నిన్ను చూసి నవ్వుతారు. నీ ప్లాన్స్‌ని చిన్నవి చేసి చూపిస్తారు. నువ్వు చేసే ప్రయత్నానికి .. ఓవర్.. అని ముద్ర వేస్తారు.నీ వల్ల వాళ్ళలో కలిగే గిల్ట్ ని ఆపాలని చూస్తున్నారు. నువ్వు ఆగిపోతే వాళ్ళు ప్రశాంతంగా నిద్రపోతారు. అవసరమైతే అలాంటి వారికి వదిలేయాలి కాని.. వాళ్ల కోసం నీ గోల్‌ను వదులుకోకూడదు.

నీవు మాత్రమే కష్టపడుతున్నావు.. అలాంటప్పుడు ఫలితం కూడా నీకు మాత్రమే వస్తుంది. కాని అలా నీ ఒక్కడికే వస్తే మిగతా వారికి ఈర్ష.. అసూయ..ద్వేషం పెరుగుతాయి కదా..! నిన్ను నువ్వే ముందుకు నెట్టుకోవాలి. నిన్ను నువ్వే లేపుకోవాలి. అద్దంలో నిన్ను నువ్వు చూసుకుని "నువ్వు చేయగలవు" అని చెప్పుకోవాలి. అదే అసలైన గేమ్. ఈ ఒంటరి పోరాటమే నిన్ను స్ట్రాంగ్‌గా మారుస్తుంది. ఒంటరితనం అంటే డిప్రెషన్ కాదు, అది డెవలప్‌మెంట్. డిప్రెషన్ అంటే నువ్వు లొంగిపోవడం, ఒంటరితనం అంటే నువ్వు తయారవ్వడం. నీ లోపల వినిపించే నెగటివ్ మాటలకి సమాధానం.

రాశీఅవశ్రీఎ ఒమ్ఘంశీఅం ఎబఅశ్రీస జూశీషవతీటబశ్రీ ష్ట్రబఘ్ఖఅం ఇది కేవలం ఒక డైలాగ్ కాదు, ఇదొక రూల్. నువ్వు ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రమే నిజంగా నువ్వు ఎవరో నీకు అర్థమవుతుంది. ఎవరూ చూడనప్పుడు కూడా నువ్వు సిన్సియర్‌గా పని చేసి కొత్త విషయాలు నేర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థితికి ఎదుగుతారు.

# వారానికి ఒక్క పెగ్ వేసినా రిస్క్ తప్పదా?



ఒక్క పెగ్ వేస్తే ఆరోగ్యం బాగుంటుందని చాలా మంది నమ్ముతుంటారు. కానీ, డాక్టర్ ఎర్నెస్ట్ హాక్ వంటి నిపుణులు మాత్రం వారానికి ఒక్క డ్రింక్ తీసుకున్నా అది ప్రమాదకరమే.. మద్యం విషయంలో సురక్షితమైన పరిమితి అంటూ ఏదీ లేదు అని కుండబద్దలు కొడుతున్నారు. అమెరికాలో 2019లో నమోదైన 1.8 మిలియన్ క్యాన్సర్ కేసుల్లో సుమారు లక్ష కేసులు మద్యం వల్లే సంభవించాయి. పొగాకు, రేడియేషన్, ఆస్బెస్టాస్.. వీటి వల్ల క్యాన్సర్ వస్తుందని అందరికీ తెలుసు. కానీ, ఆల్కహాల్ కూడా అదే స్థాయి ప్రమాదకరమైన 'కార్సినోజెన్' (క్యాన్సర్ కారకం) అని చాలా మందికి తెలియదు. అమెరికాలో జరిగిన తాజా సర్వే ప్రకారం, సగం మంది అమెరికన్లకు మద్యం వల్ల క్యాన్సర్ వస్తుందనే విషయమే తెలియదు. కానీ, వైద్య శాస్త్రం మాత్రం మద్యం సేవించడం వల్ల ఏడు రకాల క్యాన్సర్ల ముప్పు స్పష్టంగా పెరుగుతుందని హెచ్చరిస్తోంది. అసిటాల్డిహైడ్ : శరీరం మద్యాన్ని విచ్ఛిన్నం చేసినప్పుడు 'అసిటాల్డిహైడ్' అనే విష పదార్థం తయారవుతుంది. ఇది మన కణాలలోని డీఎన్ఏ, ప్రోటీన్లను దెబ్బతీస్తుంది. ఫలితంగా కణాలు అదుపు తప్పి పెరిగి క్యాన్సర్‌కు దారితీస్తాయి. ఫ్రీ రాడికల్స్ ఉత్పత్తి: మద్యం సేవించడం వల్ల శరీరంలో హానికరమైన 'ఫ్రీ రాడికల్స్' పెరుగుతాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (మంట) కలిగించి డీఎన్ఏను నాశనం చేస్తాయి. హార్మోన్ల అసమతుల్యత: ఆల్కహాల్ వల్ల శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయి. దీనివల్ల ముఖ్యంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ముప్పు గణనీయంగా పెరుగుతుంది. పోషకాల గ్రహణశక్తి దెబ్బతినడం: మద్యం వల్ల విటమిన్లు, పోషకాలను శరీరం గ్రహించలేకపోతుంది, ఇది రోగనిరోధక శక్తిని తగ్గించి క్యాన్సర్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. మద్యం ప్రభావం పురుషుల కంటే మహిళలపై ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మహిళల్లో: వారానికి ఒక డ్రింక్ కంటే తక్కువ తీసుకునే వారిలో క్యాన్సర్ ముప్పు 16% ఉంటే, రోజుకు ఒక పెగ్ వేసే వారిలో అది 19% కి, రెండు పెగ్గులు తీసుకునే వారిలో 22% కి పెరుగుతుంది. పురుషుల్లో:
ఈ ముప్పు వరుసగా 10%, 11%, 13% గా ఉంటుంది. మహిళల శరీర బరువు తక్కువగా ఉండటం మరియు మద్యాన్ని అరిగించే ఎంజైములు తక్కువగా ఉండటం వల్ల వారు త్వరగా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది.

# వీకెండ్‌లో ఎంజాయ్ చేసేందుకు మరో రెండు స్పాట్స్?



వీకెండ్ వస్తే ఎక్కడికి వెళ్లాలని ఆలోచిస్తున్నారా..? ఏదైనా ప్రాంతానికి వెళ్లి ఫ్రెండ్స్, కుటుంబసభ్యులతో చిల్ అవ్వాలనుకుంటున్నా?రా..? అయితే హైదరా?బాద్‌లో ఉండే ప్రజలకు గుడ్‌న్యూస్. వీకెండ్‌లో ఎంజాయ్ చేయాలనుకునేవారి కోసం త్వరలో మరో రెండు స్పాట్లు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. చార్మినార్, నెహ్రూ జూలాజికల్ పార్క్, గొల్కొండ కోట, ట్యాంక్‌బండ్ లాంటి టూరిస్ట్ ప్రదేశాలు చాలానే ఉన్నాయి. ఇక షాపింగ్ మాల్స్, గేమింగ్ జోన్లు వంటికి నగరంలో ఎక్కడికక్కడ ఉన్నాయి. వీకెండ్‌లో ఫ్రెండ్స్, కుటుంబసభ్యులు, ఆఫీస్ కోలీగ్స్‌తో ఎంజాయ్ చేయాలనుకునేవారికి ఇవి మంచి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అయితే వీకెండ్‌లో చిల్ అవ్వాలనుకునేవారి కోసం నగరంలో త్వరలో మరో రెండు స్పాట్లు కూడా అందుబాటులోకి రాబోతున్నాయి. నీటిపై తేలియాడుతూ సముద్రం ఫీల్‌ను ఎంజ్ చేస్తూ చక్కగా ఫ్రెండ్స్, ఫ్యామిలీతో హాయిగా గడపాలనుకునేవారి కోసం టూరిజం శాఖ రెండు టూరిస్ట్ ప్రదేశాలను అభివృద్ధి చేయనుంది. నగరంలో ట్యాక్‌బండ్ అంటే తెలియనివారు ఎవరూ ఉండరు. భాగ్యనగరంలో బెస్ట్ టూరిస్ట్ స్పాట్ ఇది. ఇక్కడ ఎప్పుడూ జనాలు సందడి చేస్తూ ఉంటారు. ఇక సాయంత్రం, రాత్రి సమయాల్లో అయితే ప్రజలు ఇక్కడ తెగ ఉంటారు. ఇప్పటికే ట్యాక్‌బండ్‌లో విహరించేందుకు బోటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. బోట్‌లో తిరుగుతూ నీళ్లల్లో ట్యాక్‌బండ్ మొత్తం చుట్టేయవచ్చు. అయితే త్వరలో హౌజ్ బోటులను కూడా తెలంగాణ టూరిజం ప్రవేశపెట్టనుంది. వీటిల్లో రెండు డబుల్ బెడ్రూంలు ఉంటాయి. అలాగే ఈ బోటుల్లో ఫుడ్ క్యాంటీన్లతో పాటు ఇతర సౌకర్యాలు అన్నీ ఉంటాయి. నీటిపై తేలియాడే ఇల్లు లాంటి ఈ బోటుల్లో వీకెండ్స్‌లో మంచిగా చిల్ అవ్వొచ్చు. ఫ్యామిలీ కోసం బెడ్ రూమ్స్ కూడా వీటిల్లో ఉంటాయి. హుస్సేన్ సాగర్‌లో రెండు హౌజ్ బోట్లను ప్రవేశపెట్టనుండగా.. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తారు. ఇక దుర్గం చెరువులో 6 బోట్లను తీసుకురానున్నారు. ఒక్కో బోటులో రెండు డబుల్ బెడ్ రూంలు ఉంటాయి. దీంతో మొత్తం 12 బెడ్ రూంలు


అందుబాటులో ఉంటాయి. ఈ బోట్ల నిర్వహణ, బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ప్రభుత్వం అప్పగించనుందని తెలుస్తోంది. అలాగే ప్రభుత్వమే నిర్వహించాలా లేదా పీపీపీ పద్ధతిలో నిర్వహించాలా అనే దానిపై కూడా ఆలోచనలు చేస్తోంది. త్వరలో ఈ హౌజ్ బోట్లు ట్యాక్ బండ్, దుర్గం చెరువుల్లో అందుబాటులోకి రానున్నాయి. కాగా ఇప్పటికే నగరంలో అనేక టూరిస్ట్ స్పాట్స్ ఉండగా.. వీటి రాకతో నగరంలో ప్రజలకు మరో కొత్త అనుభూతి కలగనుంది. నగరంలో వీకెండ్ వస్తే పర్యాటక ప్రదేశాలు అన్నీ జనాలతో కిక్కిరిసి ఉంటాయి. దీంతో ఈ హౌజ్ బోట్లు సక్సెస్ అవుతాయని పర్యాటకశాఖ అధికారులు భావిస్తున్నారు.

# ఫ్రిజ్‌లో పెట్టిన కొత్తిమీర చెడిపోతుందా?



ఐతిబిఇఞ్ట్రవని ుతిజూబ: కొత్తిమీరను ఎక్కువ కాలం తాజాగా ఉంచుకోవాలనుకుంటే కొన్ని ట్రిక్స్ పాటించడం చాలా ముఖ్యం. చాలా మంది కొత్తమీరను ఫ్రిజ్‌లో పెట్టిన తర్వాత కూడా వాడిపోవడం, కుళ్లిపోవడం జరుగుతుంది. కొత్తిమీర ఇది లేకుండా ఏ వంట పూర్తి కాదు. వంట చేశాక చివరగా కొత్తమీద వేస్తే ఆ రుచే మారిపోతుంది. అందుకే ప్రతి ఒక్కరు కూరల్లో కొత్తిమీర వాడుతుంటారు. అంతేకాదు కొత్తిమీరతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే మనం మార్కెట్ నుంచి కొత్త మీరను కొని తెచ్చిన తర్వాత ముందుగా ఫ్రిజ్‌లో పెడతాము. ఎందుకంటే బయట పెడితే త్వరగా వాడిపోతుంది. అందుకే ఫ్రిజ్‌లో స్టోర్ చేస్తాము. కానీ ఫ్రిజ్‌లో పెట్టినా అది వాడిపోవడం, చెడిపోవడం జరుగుతుంది. దీంతో కొత్తిమీర వృధా అవుతుంది. మీరు కొత్తిమీరను ఫ్రిజ్‌లో పెట్టినా చెడిపోతుంటే ఈ ట్రిక్ వాడి చూడండి. ఎప్పుడు కూడా తాజాగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కొత్తిమీరను ఎక్కువ కాలం తాజాగా ఉంచుకోవాలనుకుంటే కొత్తిమీరను తీసుకొని కడగాలి. ఇప్పుడు కొత్తిమీరను ఒక గుడ్డ లేదా టిష్యూపై పరిచి పూర్తిగా ఆరబెట్టండి. ఆకులు చెడిపోవడానికి తేమ అతిపెద్ద కారణం. దీని ప్రకారం.. కొత్తిమీరను పూర్తిగా ఆరబెట్టడం మంచిది. కొత్తిమీరను తాజాగా ఉంచడానికి ఇది ఒక గొప్ప మార్గం. కొత్తిమీర ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే, దుకాణం నుండి కొన్న తర్వాత దాని ఆకులను కత్తెరతో కత్తిరించాలి. తరువాత దానిని నీటిలో నానబెట్టి ఒక గుడ్డలో చుట్టాలి. ఇది చాలా రోజులు తాజాగా ఉంటుంది. కొత్తిమీరను కట్టలుగా కొనే వారు నీటిలో కొద్దిగా వెనిగర్ వేసి చల్లుకోవచ్చు. కొత్తిమీరను ఒక గుడ్డలో చుట్టి ఫ్రీజర్‌లో ఉంచడం ద్వారా ఎక్కువ కాలం తాజాగా ఉంచవచ్చు. దీనివల్ల అది త్వరగా చెడిపోకుండా ఉంటుంది. లేకపోతే కొత్తిమీరను ప్లాస్టిక్ సంచిలో చుట్టి ఫ్రీజర్‌లో ఉంచాలి. కొత్తిమీరను కడిగి ఎండబెట్టి దాని వేర్లను కత్తిరించండి. ఆకులను బాగా నానబెట్టండి. తరువాత వాటిని చిన్న ముక్కలుగా కోయండి. తరిగిన కొత్తిమీరను గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేయండి. ఇది చాలా కాలం పాటు తాజాగా ఉంటుంది.

# మగవాళ్ళను వేధిస్తోన్న ఆ సమస్యలకు ఈ గింజలతో గుడ్ బై చెప్పేయండి!



ఈ ప్రకృతిలో మనకీ తెలియని ఎన్నో మొక్కలు ఉన్నాయి. అవి మన ఆరోగ్య సమస్యలకు కూడా చెక్ పెట్టగలవు. ఎందుకంటే, వీటిలో ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. అయితే, ఇప్పుడు చెప్పుకోబోయే గింజలు డేంజర్ అని చెబుతారు. ప్రకృతిలో పెరిగే ప్రతి మొక్క ఏదోక వ్యాధిని తగ్గించగలవు. కొన్ని మనల్ని కాపాడతాయి. మరికొన్ని విషపూరితంగా ఉంటాయి. అయితే, ఎంతటి విషాన్ని అయినా మార్చే శక్తీ ఆయుర్వేదానికి మాత్రమే ఉంది. వాటిలో ముషిణి గింజలు కూడా ఒకటి. వీటిని మనం 'విషముష్టి' అని పిలుస్తాము. ఇవి డేంజర్ కానీ, మంచిగా క్లీన్ చేస్తే దీనికి మించిన ఔషధం ఎక్కడా దొరకదని నిపుణులు చెబుతున్నారు. కీళ్ల నొప్పులు: ఎన్నో ఏళ్ల నుంచి కీళ్ల నొప్పులతో బాధ పడే వారికీ దీనిని తైలాలుగా చేసి దానిని నివారిస్తారు. అంతేకాదు, కండరాల నొప్పులకు కూడా దీనితో చేసిన మందులను ఉపయోగిస్తారు. పక్షవాతంతో బాధ పడే వారికీ ఈ గింజలు ఓ వరం. అంతేకాదు, నరాల బలహీనత వంటి సమస్యలకు కూడా వీటి నుంచి మందులు తయారు చేస్తారు. ఇంకా చెప్పాలంటే విపరీతమైన కడుపునొప్పికి కూడా చెక్ పెట్టగలవు. అయితే ఇక్కడ తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం ఏంటంటే.. ఈ ముషిణి గింజలను డైరెక్ట్ గా అస్సలు తినకండి. చాలా డేంజర్. వీటిని పచ్చిగా అస్సలు తినకూడదు. ఆయుర్వేద నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే వీటిని వాడాలి. అలా అని మోతాదుకి మించి వాడకూడదు. అయితే ఇక్కడ తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం ఏంటంటే.. ఈ ముషిణి గింజలను డైరెక్ట్ గా అస్సలు తినకండి. చాలా డేంజర్. వీటిని పచ్చిగా అస్సలు తినకూడదు. ఆయుర్వేద నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే వీటిని వాడాలి. అలా అని మోతాదుకి మించి వాడకూడదు.

## నోరూరించే పల్లీ చట్నీ ఇలా చేస్తే.. ఒక్క మెతుకు కూడా వదలరు!



ఇప్పటి వరకు ఎన్నో రకాల పచ్చళ్ళు తినే ఉంటారు. కానీ, అన్నింటిలో పల్లీల చట్నీ రుచిగా ఉంటుంది. అయితే, మీరు లేట్ చేయకుండా వేరుశనగ పల్లీ చట్నీ ఎలా తయారు చేయాలి? ఇప్పటికీ రోటీ పచ్చళ్ళు ఏంతో మంది తింటారు. అయితే, ఇది కొందరు మాత్రమే మంచిగా చేయగలరు. చట్నీ ఏదయినా అన్ని కరెక్ట్ గా వేసి చేస్తే అదిరిపోద్ది. చికెన్ కూడా సరిపోదు. ఆకలి వేస్తే ఏదోకటి తినాలనిపిస్తుంది. ఇక కొందరికి కారంగా తినాలనిపిస్తూ ఉంటుంది. అలాంటి సమయంలో పల్లీల చట్నీ చేసుకుని తింటే మీరు మంచి భోజనం తిన్నామనే ఫీలింగ్ కూడా ఉంటుంది. కావాల్సిన పదార్థాలు : పల్లీలు, ఎండుమిర్చి అయితే ఇది, లేకపోతే పచ్చిమిర్చిని అయినా తీసుకోవచ్చు, వెల్లుల్లి రెబ్బలు, చింతపండు, తాలింపు కోసం.. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చి, నూనె, రుచికి సరి పడినంత ఉప్పు. ముందుగా పాన్ తీసుకుని దానిలో శనగ గింజలు వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత వాటిని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత పాన్ తీసుకుని దానిలో కొద్దిగా నూనె వేసి ఎండుమిర్చి లేదా పచ్చి మిర్చిని వేసి బాగా వేయించాలి. ఇక ఇప్పుడు దానిని తీసుకుని గ్రైండ్ చేసుకోవాలి. మధ్యలో కొంచం చింతపండు కూడా వేసి మళ్ళీ మిక్సీ పట్టుకోవాలి. దానిని ఇప్పుడు ఒక బౌల్ లోకి తీసుకుని తాలింపు పెట్టుకోవాలి. అంతే, వేడి వేడి పల్లీల చట్నీ రెడీ.

## అమ్మాయిలకు ఇది అమృతం?



ఆడవాళ్ళు ఎప్పుడూ ఏదోక సమస్యతో ఇబ్బంది పడుతూనే ఉంటారు. అయితే, వాటిని తగ్గించుకోవడం కోసం హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూనే ఉంటారు. వాటిలో ప్రధాన సమస్య కాళ్ళ పగుళ్ళు. ఒక్క రూపాయి కూడా లేకుండా మీ ఇంట్లో ఉండే వాటితోనే ఇక్కడ చెప్పిన చిట్కాతో తగ్గించుకోండి. చలి కాలం రాగానే చాలా మంది అమ్మాయిలకు చర్మం పొడిబారడం, కాళ్ళ పగుళ్ల రావడం వంటివి జరుగుతుంటాయి. అయితే, వీటిలో 'కాళ్ల పగుళ్లు' సమస్య ఎంతో మందిని వేదనకు గురి చేస్తుంది. నడిచేటప్పుడు కూడా కొంచం ఇబ్బందిగా ఉంటుంది. అయితే, దీని నుంచి బయటపడటానికి ఎన్నో క్రీములు వాడుతారు. అయినా కూడా ఎలాంటి ఉపయోగం ఉండదు. దాని కంటే మీ ఇంట్లో ఉండే వాటితోనే ఈ సమస్యకు గుడ్ బై చెప్పొచ్చు. తయారీ విధానం: పల్లీల పొట్టును ఒక గిన్నెలోకి తీసుకుని గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత దీనిలో ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె, తేనె వేసి మిక్స్ చేయాలి. ఆ తర్వాత దీనిలో కొద్దిగా పాలు పోసి పేస్ట్ లా చేయాలి. మీ పాదాలను ముందుగా నీటితో శుభ్రపరచి.. ఆ తర్వాత ఈ పేస్ట్‌ను పగుళ్లు ఉన్న ప్రదేశంలో రాసి 10 నిముషాల పాటు ఉంచి నీటితో శుభ్ర పరచుకోండి. ఇలా చేసిన తర్వాత రక్తప్రసరణ కూడా మెరుగుపడి పగుళ్లు తగ్గుతాయి. అమ్మాయిల్లో ఎవరైతే ఈ కాళ్ళ పగుళ్ళ వల్ల బాధ పడతారో వాళ్ళు వారంలో రెండు సార్లు ఇలా చేస్తే, మీ పాదాలు మెత్తగా అవుతాయి. ఖరీదైన క్రీములు వాడే కంటే, ఇంట్లో ఉండే వాటితోనే సులభంగా వాడుకోండి.

## పరగడుపున అరటి పండును తినొచ్చా?



అరటి పండులో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇది మన శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే, దీని వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, చాలా మంది దీనిని పరగడుపున తీసుకుంటారు. ఇలా తీసుకోవడం మంచిదేనా? ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తాయా? మనలో చాలా మంది అరటి పండును పరగడుపున తింటారు. అయితే, అసలు ఇలా తినొచ్చా? లేదో అని కూడా తెలుసుకోకుండా తినేస్తారు. పరగడుపున అరటి పండును తీసుకుంటే.. అది సరిపోను శక్తినివ్వదని వైద్యులు చెబుతున్నారు. ఇంకా ఇది ఆ సమయంలో ఐరన్ ను గ్రహించ లేదు. దీని వలన ఇమ్యూనిటీ పవర్ కూడా తగ్గిపోతుంది. ఇక బరువు తగ్గాలనుకునే వారు దీనిని ఎక్కువగా తీసుకోకూడదు. బనానాలో క్యాలరీలు చాలా తక్కువ ఉంటాయి. దీనిని తీసుకున్న గంటకే ఆకలి వేస్తుంది. ఇక ఏదోకటి తినేస్తారు. ఆ తర్వాత బరువు కూడా అమాంతం పెరుగుతారు. అరటి పండులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇంకా ఇది కడుపు నొప్పిని కూడా తీవ్రతరం చేస్తుంది. కాబట్టి, అరటి పండును ఎక్కువగా తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. పరగడుపున తీసుకుంటే అరటి పండ్లను తీసుకుంటే గ్యాస్, ఎసిడిటీ ఎక్కువ అవుతుంది. దీని వలన మగ వారికీ, ఆడ వాళ్ళకి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. (ఔూఇ: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది) పరగడుపున తీసుకుంటే అరటి పండ్లను తీసుకుంటే గ్యాస్, ఎసిడిటీ ఎక్కువ అవుతుంది. దీని వలన మగ వారికీ, ఆడ వాళ్ళకి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి.

## కీళ్లు నొప్పులుగా ఉన్నాయా?



ఉరుకుల పరుగుల జీవితంలో రక్తపోటు, అధిక బరువు, కీళ్ల నొప్పులు నిద్రలేమి వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ మందుల షాపుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మన ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారం ఉంది. అదే అశ్వగంధ. దీనిని 'ఇండియన్ జిన్సెంగ్' అని కూడా పిలుస్తారు. శరీరానికి గుర్రపు వేగాన్ని, శక్తిని ఇచ్చే గుణం దీనికి ఉండటం వల్లే దీనికి ఆ పేరు వచ్చింది. అశ్వగంధను టీ రూపంలో తీసుకోవడం వల్ల కలిగే లాభాలను ఆయుర్వేద నిపుణులు వివరిస్తున్నారు. అశ్వగంధ కేవలం ఒక మూలిక మాత్రమే కాదు, అది శరీరంలోని హార్మోన్లను క్రమబద్ధీకరించే ఒక శక్తివంతమైన ఔషధం. ఒత్తిడిని తగ్గించే కార్టిసాల్ నియంత్రణ నుండి, పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడం వరకు ఇది ఎంతో మేలు చేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం, యాలకులు కలిపి తయారు చేసే ఈ టీ రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల్లోనూ సాటిలేనిది. రోగనిరోధక శక్తి : చలికాలంలో మారుతున్న సీజన్లలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలను ఎదుర్కోవడానికి ఇది శరీరానికి అవసరమైన బలాన్ని ఇస్తుంది. ఒత్తిడి ఆందోళన: శరీరంలో ఒత్తిడిని కలిగించే 'కార్టిసాల్' హార్మోన్‌ను ఇది అదుపులో ఉంచుతుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత చేకూరి, ఆందోళన తగ్గుతుంది. బరువు నియంత్రణ: అశ్వగంధ టీ శరీర మెటబాలిజంను (జీవక్రియ) వేగవంతం చేస్తుంది. దీనివల్ల కొవ్వు నిల్వలు కరిగి, బరువు తగ్గడం సులభమవుతుంది. కీళ్ల నొప్పులు: ఇందులోని 'యాంటీ ఇన్ఫ్లమేటరీ' గుణాలు ఆర్థరైటిస్ మరియు కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. కీళ్లలో దృఢత్వాన్ని తగ్గించి నడకను సులభతరం చేస్తుంది. మంచి నిద్ర: నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ టీని క్రమం తప్పకుండా తీసుకుంటే నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది.

# టీ20 వరల్డ్ కప్: ఆఫ్ఘనిస్థాన్ పై న్యూజిలాండ్ ఈజీ విక్టరీ

**183 పరుగుల భారీ లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి ఛేదించిన కివీస్**

**ఆఫ్ఘన్ బ్యాటర్ గుల్బదిన్ నయీబ్ (63) మెరుపు ఇన్నింగ్స్**

**కివీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన సీఫర్ట్ (65), ఫిలిప్స్ (42)**

**13 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించిన న్యూజిలాండ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ గెలుపు బోణీ కొట్టింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 183 పరుగుల భారీ లక్ష్యాన్ని కివీస్ జట్టు 17.5 ఓవర్లలోనే ఛేదించి టోర్నీలో తమ తొలి గెలుపును నమోదు చేసుకుంది. భారీ లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. 14 పరుగులకే ఓపెనర్ ఫిన్ అలెన్ (1), రచిన్ రవీంద్ర (0) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వికెట్ కీపర్ టిమ్ సీఫర్ట్ (65), గ్లెన్ ఫిలిప్స్ (42) అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరూ దూకుడుగా ఆడి జట్టును విజయానికి చేరువ చేశారు. చివర్లో డారిల్ మిచెల్ (25 నాటౌట్), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (17 నాటౌట్) వేగంగా ఆడి మరో 13 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు విజయాన్ని అందించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్‌కు మంచి ఆరంభం లభించలేదు. అయితే, మిడిల్ ఆర్డర్‌లో గుల్బదిన్ నయీబ్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 35 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 63 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి తోడుగా సెదికుల్లా అటల్ (29), రసూలీ (20) రాణించడంతో అఫ్గాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగుల భారీ స్కోరు సాధించింది. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# అండర్-19 ప్రపంచకప్ 'టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్'.. చోటు దక్కించుకున్న భారత యువ త్రయం

**ఐసీసీ అండర్-19 టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో ముగ్గురు భారత ఆటగాళ్లకు చోటు**

**ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన వైభవ్ సూర్యవంశీ**

**జట్టుకు కెప్టెన్‌గా రన్నరప్ ఇంగ్లండ్ ఆటగాడు థామస్ రేవ్ ఎంపిక**

**భారత్, ఇంగ్లండ్ నుంచి ముగ్గురేసి ఆటగాళ్లు.. ఆఫ్ఘన్ నుంచి ఇద్దరు**



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ), 2026 అండర్-19 పురుషుల ప్రపంచకప్ 'టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్'ను ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక జట్టులో ముగ్గురు భారత యువ ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన వైభవ్ సూర్యవంశీ 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా ఎంపికయ్యాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్‌లో కేవలం 80 బంతుల్లో 175 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అతను అందరి దృష్టిని ఆకర్షించాడు. భారత్ నుంచి వైభవ్‌తో పాటు ఆల్‌రౌండర్ కనిష్క్ చౌహాన్, స్పిన్నర్ హెనిల్ పటేల్ కూడా ఈ 12 మంది సభ్యుల జాబితాలో స్థానం సంపాదించారు. కనిష్క్ బ్యాట్, బంతితో కీలక సమయాల్లో రాణించగా, హెనిల్ పటేల్ టోర్నీలో 11 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో 16 పరుగులకే 5 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన చేశాడు.
రన్నరప్‌గా నిలిచిన ఇంగ్లండ్ నుంచి కూడా ముగ్గురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు లభించింది. టోర్నీలో 66 సగటుతో 330 పరుగులు చేసిన థామస్ రేవ్‌ను ఈ జట్టుకు కెప్టెన్, వికెట్ కీపర్‌గా ఎంపిక చేశారు. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అతను సాధించిన అజేయ శతకం ఇంగ్లండ్ విజయంలో కీలక పాత్ర పోషించింది. టోర్నీలో 444 పరుగులతో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలిచిన బెన్ మాయెస్, 16 వికెట్లతో అగ్రస్థానంలో నిలిచిన బౌలర్ మ్యానీ లమ్స్‌డెన్ కూడా ఈ జట్టులో ఉన్నారు. సెమీఫైనల్ చేరి సంచలనం సృష్టించిన ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఇద్దరు ఆటగాళ్లు ఎంపికయ్యారు. టోర్నీలో రెండు సెంచరీలు సాధించిన ఫైసల్ ఖాన్ షినోజాదా, 14 వికెట్లు పడగొట్టిన నూరిస్తానీ ఒమర్జాయ్ తమ ప్రదర్శనలతో సెలక్టర్లను మెప్పించారు. ఆస్ట్రేలియా కెప్టెన్ ఆలివర్ పీక్ (రెండు సెంచరీలు), పాకిస్థాన్ బౌలర్ అలీ రజా (13 వికెట్లు), వెస్టిండీస్ స్పిన్నర్ విటెల్ లాప్స్ (10 వికెట్లు), శ్రీలంకకు చెందిన విరన్ చాముదిత ఈ జాబితాలోని ఇతర ఆటగాళ్లు. ఇయాన్ బిషప్, ఆండీ ఫ్లవర్ వంటి మాజీ దిగ్గజాలతో కూడిన ప్యానెల్ ఈ జట్టును ఎంపిక చేసింది.

**ఐసీసీ అండర్-19 టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ ఇదే..**

వైభవ్ సూర్యవంశీ (భారత్), విరన్ చాముదిత (శ్రీలంక), ఫైసల్ ఖాన్ షినోజాదా (ఆఫ్ఘనిస్థాన్), థామస్ రేవ్ (కెప్టెన్, వికెట్ కీపర్, ఇంగ్లండ్), ఆలివర్ పీక్ (ఆస్ట్రేలియా), బెన్ మాయెస్ (ఇంగ్లండ్), కనిష్క్ చౌహాన్ (భారత్), నూరిస్తానీ ఒమర్జాయ్ (ఆఫ్ఘనిస్థాన్), విటెల్ లాప్స్ (వెస్టిండీస్), అలీ రజా (పాకిస్థాన్), మ్యానీ లమ్స్‌డెన్ (ఇంగ్లండ్), హెనిల్ పటేల్ (భారత్).

# అభిమానులకు గుడ్ న్యూస్.. టీ20 వరల్డ్ కప్ లో భారత్ తో ఆడేందుకు పాక్ ఒప్పుకున్నట్టే!




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై నెలకొన్న ఉత్కంఠకు దాదాపు తెరపడింది. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఈ హైవోల్టేజ్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 15న నిర్వహించడం దాదాపు ఖాయమైంది. దీనికి సంబంధించిన తుది ఏర్పాట్లపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. కొలంబో వేదికగా ఈ మ్యాచ్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వర్గాలు తెలిపాయి. "ప్రస్తుతం సమావేశాలు జరుగుతున్నాయి. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఫిబ్రవరి 15న జరిగేందుకు 99 శాతం అవకాశం ఉంది" అని పీసీబీ వర్గాలు ఐఏఎన్ఎస్‌కు వెల్లడించాయి. అయితే, అంతకుముందు బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ ప్రభుత్వం షరతు విధించడంతో, ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సిన మ్యాచ్‌లో తాము పాల్గొనబోమని పీసీబీ ప్రకటించింది. ఈ నిర్ణయంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీవ్రంగా స్పందించింది. ఇలా ఎంపిక చేసిన మ్యాచ్‌లలోనే ఆడతామనే వైఖరి ప్రపంచ స్థాయి టోర్నమెంట్ స్ఫూర్తికి విరుద్ధమని హెచ్చరించింది. ఈ నిర్ణయం పాకిస్థాన్ క్రికెట్‌పై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా, ఈ టోర్నమెంట్‌లో పాకిస్థాన్ తన తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై మూడు వికెట్ల తేడాతో అతికష్టం మీద గెలిచింది. మరోవైపు, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (84*) అద్భుత ఇన్నింగ్స్‌కు తోడు, మహమ్మద్ సిరాజ్ (3/29) రాణించడంతో భారత్ తమ తొలి మ్యాచ్‌లో యూఎస్ఏపై 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్‌లో గ్రూప్ ఏ లో ఉన్నాయి. ఈ గ్రూప్‌లో నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ ఇతర జట్లు. భారత్‌తో కలిసి శ్రీలంక ఈ టోర్నీకి సహ-ఆతిథ్యం ఇస్తుండగా, పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే ఆడనుంది.

# అక్కడా మీనాక్షి పాదం మోపుతోందా?



మానస వారణాసి కొత్త చిత్రాలకు విశేష స్పందన లభిస్తోంది



హర్యానా బ్యూటీ మీనాక్షి చౌదరి ప్రతిభకు తగ్గ అవకాశాలు అందుకోవడంలో వెనుకబడుతోంది. చిన్న సినిమాతో నటిగా ప్రయాణం మొదలు పెట్టిన అమ్మడు అనతి కాలంలో స్టార్ హీరోలకు ప్రమోట్ అయినా? ఇంకా ఆస్టార్ లీగ్ లో మాత్రం చేరలేదు. సెకెండ్ లీడ్స్ లోనే కంటున్యూ అవుతోంది. వెనుక వంద కోట్ల క్లబ్ లో చేరిన చిత్రం ఉన్నా? ఛాన్సులు అందుకోవడంలో వెనుకబడిందంటే? అదృష్టం కలిసి రాకనే అనాలి. ఇటీవలే విడుదలైన -అనగనగా ఒక రాజు-తోనూ మంచి విజయాన్ని అందుకుంది. సంక్రాంతికి రిలీజ్ అయిన సినిమా విమర్శకుల ప్రశంస లందుకుంది. మీనాక్షి పాత్రకు మంచి పేరొచ్చింది. కానీ అమ్మడి తాజా లైనప్ చూస్తే మాత్రం ఖాళీగానే ఉంది. ప్రస్తుతం చేతిలో ఉంది -వృషకర్మ- ఒక్కటే. ఇందులో యువ సామ్రాట్ నాగచైతన్యకు జోడీగా నటిస్తోంది. ఈ చిత్రం మినహా కొత్త ప్రాజెక్టే ఏది చేతిలో లేదు. ఈ సినిమా విజయం సాధించినా? వెంటనే మరో సినిమాకు సైన్ చేసే గ్యారెంటీ కూడా కనిపిం చడం లేదు. ఇవన్నీ అమ్మడు ముందుగానే గెస్ చేసిందో ఏమోగానీ తాజాగా మీనాక్షి చౌదరి ఫోకస్ శాండిల్ వుడ్ పై మళ్లించినట్లు కనిపిస్తోంది. కన్నడ స్టార్ రక్షిత్ హీరోగా నటించనున్న సినిమాలో హీరోయిన్ ఛాన్స్ అందుకుందని వార్తలొస్తున్నాయి. కిరణ్. రాజ్. కె ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. గతంలో ఇద్దరి కాంబినేషన్ లో రిలీజ్ అయిన -777చార్లీ- భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కన్నడలో మరో 100 కోట్లు రాబట్టిన చిత్రాల జాబితాలో చార్లీ నిలిచింది. ఈ నేపథ్యంలోనే రక్షిత్ తో మరో ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నాడు. ఇందులో హీరోయిన్ గా తొలుత కన్నడ నటినే తీసుకో వాలనుకున్నారు. కానీ మీనాక్షి చౌదరి ఆ పాత్రకు పర్ఫెక్ట్ గా సూటవ్వడంతో ఆమెని ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. మీనాక్షికి సరైన సమయంలో వస్తోన్న అవకాశం ఇది. ఇప్పటికే తెలుగు సహా తమిళ్ లో కూడా సినిమాలు చేసింది. కానీ కోలీవుడ్ లో కూడా బిజీ అవ్వలేదు. బాలీవుడ్ లో అదృష్టాన్ని ఆరంభంలోనే నిరూపించుకునే ప్రయత్నం చేసింది. -అప్ స్టేర్స్- అనే చిత్రంతోనే చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. అటుపై బాలీవుడ్ లో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో టాలీవుడ్ పై దృష్టి పెట్టింది. ఇప్పుడిక్కాడా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ టంతో? కన్నడ మార్కెట్ లోకి ఎంటర్ అవుతుంది. మరి అక్కడైనా కలిసొస్తుందా? లేదో చూడాలి. ప్రస్తుతం అన్ని చోట్ల హీరోయిన్ల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. ఎక్కడ అవకాశాలు వస్తే అక్కడికి జంప్ అవుతున్నారు. మడి కట్టుకుని కూర్చోకుండా పని చేస్తున్నారు. కానీ మీనాక్షి చౌదరి మాత్రం గ్లామర్ ఎలివేషన్లకు దూరంగా ఉంటుంది. అదే అమ్మడికి టాలీవుడ్ లో ప్రతికూలంగా మారింది.



ఎత్నిక్ స్పెండర్‌లో టైమ్‌లెస్ గాంభీర్యం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965